మంగళవారం
22-11-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 150
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పెట్టుబడిదారీ గుత్తాధిపత్యంపై
పోరుకు ఐక్య కూటమి

పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం, వారి ప్రభుత్వం చేస్తున్న దాడిని సవాలు చేయడానికి కార్మిక సంఘాలు, వామపక్షాలు 'ఐక్య కూటమి'గా ఏర్పడాలని బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. 2లో

అందినకాడికి అమ్మేసెయ్!

- లాభాల్లో ఉన్న పీఎస్‌యూలు బడాబాబులకే...
- కేంద్ర సర్కారుకు చెల్లిస్తున్న డివిడెండ్లే సాక్ష్యం
- గత ఎనిమిదేళ్లలో కేంద్రానికి రూ.3.3 లక్షల కోట్లు
- నష్టాలంటూ కేంద్రం కట్టుకథలు
- గొంతుకోసేందుకు ఏకపక్షంగా కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ: కేంద్ర సర్కారు పీఎస్‌యూలపై కత్తిగట్టింది. వాటిని అందినకాడికి అమ్మివేయాలనే భారీ కుట్రను పకడ్బందీగా అమలు చేస్తోంది. అంతిమంగా దేశంలో కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణకు రాచబాటలు పరిచి, బడాబాబులకు ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూలు)ను కట్టబెట్టేందుకు సకల యత్నాలు చేస్తోంది. కేంద్ర సర్కారు దురాశకు పీఎస్‌యూలు బలిపశువులుగా మారుతున్నాయి. గడిచిన ఎనిమిదేళ్లలో పీఎస్‌యూల్లోని వాటాల విక్రయంతో కేంద్ర ప్రభుత్వం రూ.4.5 లక్షల కోట్లను ఆర్జించింది. దీనికోసం చట్టంలోని నిబంధనలను ఏకపక్షంగా మార్చేసింది. ఏ ఏడాదికి ఆ ఏడాది అంచనాలకు మించి లాభాలను గడిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల ఊబిలోకి కూరుకుపోయినట్టు కట్టుకథలు

- మిగతా 2 లో

కోషియారీని పంపేయండి

- కేంద్రం స్పందించకుంటే తీవ్రపరిణామాలు
- శివాజీపై వ్యాఖ్యలకు షిండే వర్గం ఆగ్రహం
- కాంగ్రెస్, ఎన్‌సీపీ, శివసేన ఆందోళనలు
- గవర్నరును సమర్థించిన బీజేపీపై సూలే ఆగ్రహం

ముంబై/పూణే: ఛత్రపతి శివాజీ మహరాజ్ వ్యవహారం మహారాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. ఈ తేనెతుట్టెను మహారాష్ట్ర గవర్నరు భగత్‌సింగ్ కోషియారీ కదిపారు. దీనిపై సీఎం షిండే వర్గం, కాంగ్రెస్, ఎన్‌సీపీ, శివసేన వంటి అనేక పార్టీలు స్పందించాయి.

మహారాష్ట్ర పాలకుడు, యోధుడు ఛత్రపతి శివాజీపై కోషియారీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై శివసేన తిరుగుబాటు నేత, సీఎం షిండే వర్గం ఎమ్మెల్యే ఎట్టకేలకు స్పందించారు. గవర్నర్‌ను మహారాష్ట్ర నుంచి పంపేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం దీనిపై తీవ్రంగా స్పందించకపోతే రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, షిండే వర్గం మధ్య విభేదాలు రావచ్చని హెచ్చరించారు. బుల్దానా అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ఈ మేరకు బీజేపీకి గట్టి సందేశం ఇచ్చారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ సీనియర్ నేతలు దీనిపై దృష్టిసారించాలని ఆయన తెగేసి చెప్పారు. శివాజీ గురించి గవర్నరు గతంలో

- మిగతా 2 లో

వైసీపీ నేతల దందా

పొరుగు రాష్ట్రానికి వెళ్లిన జాకీ పరిశ్రమ

- పాలకుల తొత్తుగా పోలీసులు
- రైతు సమస్యలపై 12న ధర్నాలు
- అనంత నుంచి ఐక్య ఉద్యమానికి శ్రీకారం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం: అనంతపురం జిల్లాలో ఐదువేలమంది మహిళలకు ఉపాధి కల్పించే జాకీ పరిశ్రమ అధికార పార్టీ నేతల దందా వల్ల పొరుగు రాష్ట్రానికి తరలిపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఆ పరిశ్రమ యజమానుల నుంచి రూ.10 కోట్లు డిమాండ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయని, దీనికి ప్రభుత్వం, ఎస్పీ ఫక్కీరప్ప సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీ నేతలకు తొత్తుగా వ్యవహరిస్తోందని, భారత శిక్షాస్మృతి రాష్ట్రంలో అమలు జరుగుతుందా అని రామకృష్ణ ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వ విధానాలపై ఆయన మండిపడ్డారు. అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని రామకృష్ణ చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యంగా అనంతపురం రైతులకు సాగు పరిస్థితులు అనుకూలంగా లేవని, కోస్తా ప్రాంతంలో గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్డెక్కుతున్నారని తెలిపారు. రైతు సమస్యలపై డిసెంబర్ 12న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టనున్నట్లు రామకృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ పాలనను పక్కనపెట్టి ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఏ మూల చూసినా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, అయినా వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గొప్ప విజయాలు సాధించామని సీఎం జగన్ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. లక్షలాది మంది పేదలకు ఇంటి పట్టాలిస్తున్నామని, ఇంటి నిర్మాణాలు చేపడుతున్నట్లు బీరాలు పలికారని, కానీ ఇప్పటివరకు ఇంటి నిర్మాణాలు పూర్తిగా జరగలేదని చెప్పారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమూలకు చాలవని చెప్పారు. సామాన్యులు ఇళ్ల నిర్మాణం చేసుకోవాలంటే కనీసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇసుక సరఫరా కాంట్రాక్టును ఒక్కరికే ఇవ్వడం వల్ల అనేక అక్రమాలు జరుగుతున్నాయని, సరసమైన ధరకు ఇసుక లభించడం లేదని రామకృష్ణ వివరించారు. అర్హులైన చాలామంది లబ్ధిదారులు ఇంటి నివేశ

- మిగతా 2 లో

ఇండోనేషియాలో
భారీ భూకంపం

- 56 మందికి పైగా మృతి... వందలాది మందికి గాయాలు
- రిక్టర్ స్కేలుపై 5.6గా నమోదు

జకర్తా: ఇండోనేషియాలో సోమవారం భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 5.6 తీవ్రతతో నమోదయిన ప్రకంపనల ధాటికి దేశ ప్రధాన భూభాగమైన జావా ద్వీపం వణికిపోయింది. పశ్చిమ జావాలోని సియాంజుర్ పట్టణంలో ఇప్పటి వరకు 56 మందికి పైగా మృతి చెందినట్లు తెలుస్తోంది. 800 మందికి పైగా గాయపడినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. వందలాది ఇళ్లు, ఇతర నిర్మాణాలు ధ్వంసం కావడంతో శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉంటారని భావిస్తున్నట్లు సియాంజుర్ పాలనాధికారి హెర్మన్ సుహెర్మాన్ ఒక వార్తా సంస్థకు తెలిపారు. సియాంజుర్ పట్టణం... దేశ రాజధాని జకర్తాకు ఆగ్నేయ దిశలో 75 కి.మీల దూరంలో ఉంది. ఇక్కడే 10 కి.మీల లోతులో భూకంప కేంద్రం నమోదయిందని, అయితే సునామీ వచ్చే

- మిగతా 2 లో

ఏపీ సర్కార్‌కు మళ్లీ చుక్కెదురు

ఏఎంవీఐ నోటిఫికేషన్ నిలిపేసిన హైకోర్టు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. ప్రభుత్వ నిర్ణయాలు తరచూ వివాదాస్పదమవుతున్నాయి. అధికారులు తీసుకుంటున్న తొందరపాటు నిర్ణయాలు న్యాయసమీక్షకు నిలబడకపోవడంతో ప్రభుత్వం అభాసుపాలవుతోంది. వైసీపీ ప్రభుత్వం మూడున్నర సంవత్సరాల కాలంలో ఆఘమేఘాలపై తీసుకున్న అనేక నిర్ణయాలు అత్యంత వివాదాస్పదమయ్యాయి. దీనిలో భాగంగానే తాజాగా ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన సహాయ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ) నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ సోమవారం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రశ్నపత్రం ఆంగ్లంలోనే ఉంటుందన్న ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటనపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కాశీ ప్రసన్నకుమార్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. నిబంధనలకు విరుద్ధంగా, గతంలో ఇచ్చిన కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ప్రశ్నపత్రం ఇస్తామనడాన్ని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఏఎంవీఐ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రశ్నపత్రం ఆంగ్లంలో ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది.

బ్యాంకులు కుదేలు

రూ. 10 లక్షల కోట్ల బకాయిలు మాఫీ

- ఎన్పీఏల తగ్గుదలకు ఇదే కారణం
- ప్రభుత్వరంగ బ్యాంకుల మాఫీనే అధికం
- రుణాల్లో 13 శాతమే వసూలు
- సమాచార స్వేచ్ఛ చట్టం కింద ప్రశ్నకు ఆర్‌బీఐ సమాధానం

ముంబై: దేశంలోని బ్యాంకులు గత ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల మొండి బకాయిలను మాఫీ చేశాయి. బ్యాంకులు ఇచ్చిన రుణాల్లో 13 శాతం మాత్రమే రికవరీ చేయగలిగాయి. గత ఐదేళ్లలో బ్యాంకుల నిరర్థక ఆస్తులను రూ.10,09,510 కోట్లు (123.86 బిలియన్లు) తగ్గించేందుకు ఈ రుణ మాఫీలు దోహదపడ్డాయి. సమాచార స్వేచ్ఛ చట్టం కింద ఒక ఆంగ్ల వార్తా సంస్థ చేసిన అభ్యర్థనకు భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ప్రతిస్పందనలో ఈ సమాచారం ఉంది. గత ఐదేళ్లలో రూ.1,32,036 కోట్ల మొండి బకాయిలను మాత్రమే బ్యాంకులు వసూలు చేశాయి. మూడు నెలలకు పైగా (90 రోజులు) చెల్లించని రుణాలను బ్యాంకులు మొండి బకాయిలుగా ప్రకటిస్తాయి. గత పదేళ్లలో రుణ మాఫీల కారణంగా నిరర్థక ఆస్తుల తగ్గింపు రూ.13,22,309 కోట్లుగా ఆర్‌బీఐ పేర్కొంది. ఈ వివరాలను బ్యాంకులు అందించాయని ఆర్‌బీఐ తన ఆర్టీఐ సమాధానంలో పేర్కొంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు చాలా వరకు రుణాలను మాఫీ చేశాయి. రూ.734,738 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. ఇదిలా ఉండగా అత్యధికంగా రుణమాఫీ చేసిన బ్యాంకుల పేర్లను ఆర్‌బీఐ వెల్లడించలేదు. ఆ సమాచారం తమ వద్ద లేదని ఆర్‌బీఐ బదులిచ్చింది. బ్యాంకులు అనేక సంవత్సరాల్లో పెద్ద, చిన్న రుణాలను మాఫీ చేసినప్పటికీ, ఈ రుణగ్రహీతల వ్యక్తిగత వివరాలను బ్యాంకులు ఎప్పుడూ వెల్లడించలేదు. భారతీయ స్టేట్ బ్యాంకు విషయానికొస్తే, గత ఐదేళ్లలో రైటాఫ్‌ల కారణంగా నిరర్థక ఆస్తులు రూ.2,04,486 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.67,214 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.66,711 కోట్లు.

ఉద్యోగాల పేరుతో మోసం

- రూ.30 లక్షలకు టోకరా
- నకిలీ కానిస్టేబుల్ అరెస్టు

విశాలాంధ్ర-గుంతకల్లు: ఇటీవల కాలంలో ఉద్యోగాల పేరుతో మోసాలు పెరిగాయి. గుంతకల్లు రైల్వే ఉద్యోగాల్లో జరిగిన సంఘటన మరువకముందే, మరో ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక వ్యక్తి అమాయకులైన నిరుద్యోగుల నుంచి ఏకంగా రూ.30 లక్షల వరకు మోసం చేశాడు. వివరాల్లోకి వెళితే శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్నతాధికారి వద్ద కానిస్టేబుల్‌ననీ, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్నత అధికారులతో పరిచయాలు ఉన్నాయని, పోలీసు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అనంతపురం జిల్లా, గుంతకల్లు పట్టణంలోని కత్తుల వీధిలో నివాసం ఉంటున్న పృథ్వీ నిరుద్యోగులను మభ్య పెట్టాడు. వారి నుంచి భారీగా డబ్బు వసూలు చేశారు. చింటూ, హర్ష రెడ్డి తదితర పేర్లతో నిరుద్యోగ యువతితో పరిచయం పెంచుకున్నాడు. హెర్బల్ ప్రొడక్ట్స్ అమ్ముకునే ఓ మహిళ ఏకంగా రూ.17 లక్షల వరకు ఇచ్చినట్టు సమాచారం. అలాగే ఎస్‌ఎల్‌వీ థియేటర్ సమీపంలోని ఓ కూల్ డ్రింక్ షాపు యజమాని నుంచి రూ.8 లక్షలు, తిమ్మాపురం గ్రామానికి చెందిన హనుమేశ్ అనే నిరుద్యోగి నుంచి రూ.4.5 లక్షలు, ఓ మహిళా పోలీస్ కూడా తన చెల్లిలి ఉద్యోగం కోసం రూ.లక్ష సమర్పించారు. ఇలా ఎంతోమంది నిరుద్యోగులను మోసగించినట్టు సమాచారం. పోలీసులు గమనించి అతని నుంచి ఆంధ్ర, తెలంగాణ పోలీసుల యూనిఫామ్‌లను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇతని బాగోతాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. పృథ్వీని టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

ఇదీ లోకం!

మన పార్టీ తరఫున మాట్లాడటానికి బాగా నోరున్న వ్యక్తిని నియమించారు

ప్రైవేట్‌కు వరం ఫసల్ బీమా

తగిన చర్యల కోసం ప్రధానికి వినయ్ విశ్వం లేఖ



న్యూఢిల్లీ: ఎన్‌డీఏ సర్కారు అట్టహాసంగా ప్రారంభించిన పంటల బీమా పథకం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)లో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీకి సీపీఐ రాజ్యసభ సభ్యుడు, పార్టీ జాతీయ కార్యదర్శి వినయ్ విశ్వం విజ్ఞప్తి చేశారు. ఈ పథకం రైతులకు కాకుండా ప్రైవేట్ కంపెనీలకు పెద్ద వరంగా మారిందని విమర్శించారు. ఈ మేరకు వినయ్ విశ్వం సోమవారం ప్రధానికి లేఖ రాశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రైతులకు చెల్లిస్తున్న సహాయంలో కోట్ల రూపాయలు ప్రైవేటు బీమా కంపెనీల పరమయ్యాయని వినయ్ విశ్వం తెలిపారు. పీఎంఎఫ్‌బీఐ పథకం ప్రారంభించిన తొలి నాళ్లలో ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోయిన రైతులకు బీమా ప్రయోజనాలు అందాయని, అయితే ఇటీవల కాలంలో రైతులకు బీమా చెల్లింపులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని, అంతటితో ఆగకుండా బీమా చెల్లింపుల్లో పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నాయని వివరించారు. పెద్దఎత్తున లాభాలు ఆర్జించడానికిగాను కొన్ని కంపెనీలకు ఈ పథకం కల్పతరువుగా మారిందని తెలిపారు. ఈ పథకం కింద రైతులకు లభించిన రక్షణ హక్కును నిర్వీర్యం

- మిగతా 2 లో

వారిని
నమ్మకండి

- టీడీపీ.. తెలుగు బూతుల పార్టీ
- జనసేనను... రౌడీసేన చేశారు
- పశ్చిమ పర్యటనలో సీఎం జగన్

3లో

ఉద్యోగ కల్పనపై
బడ్జెట్ దృష్టిపెట్టాలి

కేంద్రానికి పరిశ్రమ వర్గాల సూచన

న్యూఢిల్లీ: ఉద్యోగ సృష్టి, వినియోగాన్ని ప్రోత్సహించడం, ఫ్యాక్టరీల సామర్థ్యాల్ని పెంచడం, మౌలిక వసతుల నాణ్యతను పెంపొందించడం, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం ద్వారా ప్రైవేటు పెట్టుబడుల్ని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పీహెచ్‌డీసీసీఐ కేంద్రానికి సూచించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అధిక ద్రవ్యోల్బణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం వంటి ప్రతికూల పరిణామాలు కొనసాగుతున్న తరుణంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సిన పరిస్థితి నెలకొందని గుర్తుచేసింది. దేశీయంగా వృద్ధికి ఊతమిచ్చే రంగాలను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని తమ ప్రతిపాదనలను కేంద్ర మంత్రి ముందు ఉంచింది. వినియోగం పెరిగేందుకు దోహదం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సోమవారం జరిగిన ముందస్తు బడ్జెట్ సమావేశాల్లో సూచించాయి. ఉద్యోగ కల్పన, పన్ను వసూళ్లను పెంచడం వంటి చర్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని

- మిగతా 2 లో

కర్బన ఉద్గారాల పరిమితికి చర్యలేవి?

'కాప్' ఒప్పందంపై పర్యావరణ ప్రేమికుల పెదవి విరుపు

కైరో: ఐక్యరాజ్యసమితి అధ్వర్యంలో ఈజిప్టులో జరిగిన వాతావరణ సదస్సు (కాప్-27)లో జరిగిన ఒప్పందంపై పర్యావరణ ప్రేమికులు పెదవి విరుస్తున్నారు. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించడానికి జరిగి శిఖరాగ్ర సమావేశాన్ని మరో మరువలేని వైఫల్యంగా అభివర్ణిస్తున్నారు. సంపన్న దేశాలు విడుదల చేస్తున్న కర్మన ఉద్గారాల ఫలితంగా విపత్తులు, వాతావరణ ప్రతికూలతలు ఎదుర్కొంటున్న దాదాపు 200 పేద దేశాలను ఆదుకోవడానికి 'లాస్ అండ్ డేమేజ్' పేరుతో విపత్తు నిధిని ఏర్పాటు చేయాలని కాప్-27 సదస్సులో ఒప్పందం సంగతి తెలిసిందే. అయితే కర్బన ఉద్గారాలను పరిమితం చేయడానికి ధనిక దేశాలు చేస్తున్నదేమీ లేదని పర్యావరణ కార్య కర్తలు విమర్శిస్తున్నారు. 'వార్ ఆన్ వాంట్' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అసద్ రెహమ్ మాట్లా డుతూ... 'శూన్య పదాలు, బూటకపు వాగ్దానాలతో యుఎస్, ఈయూ, యూకే ఇతర దేశాలు... భూగ్రహాన్ని, మిలియన్ల మంది జీవితాలను, జీవనోపాధిని నాశనం చేసినందుకు బాధ్యత వహించడానికి నిరాకరించాయన్నారు. చర్చలలో పాల్గొన్న బ్రిటన్ ప్రతినిధి, టోరీ ఎంపీ, కాప్-26 అధ్యక్షుడు అలోక్ శర్మ, ఉద్గారాల పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేయ డానికి తగినంత చర్యలు తీసుకోలేదని గుర్తించి నట్లు కనిపించారు. 'మనమందరం అద్దంలోకి చూసుకోవాలి... గత రెండు వారాల్లో మనం ఆ సవాలును పూర్తిగా ఎదుర్కొన్నామా లేదా అని ఆలోచించాలి' అని ఆయన అన్నారు. 2015లో వాతావరణ మార్పుపై జరిగిన సదస్సులో 'పారిస్ ఒప్పందం' నుంచి లక్ష్యం వచ్చింది. ప్యారిస్‌లో 1.5 డిగ్రీల లక్ష్యాన్ని ఒప్పందంలో చేర్చడానికి లోతట్టు ద్వీపాలు వంటి దేశాలు ఒత్తిడిని చేశాయి. ఎందుకంటే ఉష్ణోగ్రతలు ఇంకా పెరిగితే తమ మనుగడకు ముప్పు కలిగిస్తుందని వారు భావించారన్నారు. అయితే లేబర్ షాడో క్లైమేట్ చేంజ్ సెక్రటరీ ఎడ్ మిలిబాండ్ ఇటీవలి చర్చలను తీవ్రంగా విమర్శించారు. ఆయన ఏమన్నారంటే... భూ తాపాన్ని 1.5 డిగ్రీలకు పరిమితం చేయడానికి అవసరమైన చర్యలపై డబ్బా కొట్టడాన్ని మేము మళ్లీ విన్నామన్నారు. ఫలితంగా అది తీవ్ర ప్రమాదంలో ఉందని చెప్పారు. స్కాటిష్ గ్రీన్ పార్టీ ప్రతినిధి మార్క్ రస్కెల్ ఎంఎస్‌పి మాట్లాడుతూ... శిలాజ ఇంధనాల తొలగింపు కాలం లేకపోవడం వల్ల ఈ శిఖరాగ్ర సమావేశం మరో స్మారక వైఫల్యంగా మిగులుతుందన్నారు. ఫ్రెండ్స్ ఆఫ్ ది ఎర్త్ ఆఫ్రికా కు చెందిన బాబావాలే ఒబయాంజూ మాట్లాడుతూ... దశలవారీగా బొగ్గు ఆధారిత ఇంధన శక్తి తగ్గుదల పైనే ఫలితం మాట్లాడటం వాతావరణానికి, ఆఫ్రికాకు ముప్పు అన్నారు. కానీ మొదటిసారిగా కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్న ప్రధాన దేశాలు... ప్రభావిత దేశాలకు సహాయం చేయడానికి, నష్ట పరిహారం అందించడానికి అంగీకరించాయి. దీనిని కొంతమంది వాతావరణ నిపుణులు స్వాగతిస్తుండగా, అనేక పర్యావరణ సంస్థలు, కార్యకర్తలు మాత్రం ఇది ఆచరణలో జరగడం లేదని కాలుష్యానికి కారణమవుతున్న అభివృద్ధి చెందిన దేశాలు... ప్రభావిత దేశాలకు నిధులను అడ్డుకోవడం, విడుదల చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని చెబుతున్నారు.

పెట్టుబడిదారీ గుత్తాధిపత్యంపై

పోరుకు ఐక్య కూటమి

బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు

లండన్: పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం, వారి ప్రభుత్వం చేస్తున్న దాడిని సవాలు చేయడానికి కార్మిక సంఘాలు, వామపక్షాలు 'ఐక్య కూటమి'గా ఏర్పడాలని బ్రిటన్ కమ్యూ నిస్టు పార్టీ పిలుపునిచ్చింది. బ్రిటన్ అంతటా సమ్మె స్ఫూర్తి వ్యాపించిందని, అనేక రంగాల్లోని కార్మిక సంఘాలు ఉద్య మించడానికి సుముఖంగా ఉన్నారని కమ్యూ నిస్టు పార్టీ కార్యవర్గ సభ్యుడు అలెక్స్ గోర్డాన్... కార్యనిర్వాహక కమిటీకి నివేదించారు. ప్రజల జీవన ప్రమాణాలు, ప్రజాస్వామిక, ఉపాధి హక్కులు, ప్రజా సేవలపై జరుగుతున్న దాడికి నిదర్శనమంటూ ఛాన్సలర్ జెరెమీ హంట్ ప్రకటనను ఆయన ఎత్తి చూపారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు గాను కార్మికసంఘాలతో సమర్థ సమన్వయకమిటీ ఏర్పాటుకు పూర్తి మద్దతు ఇస్తామని కమ్యూనిస్టు పార్టీ స్పష్టం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ గుత్తాధిపతాన్ని సోషలిస్టు సమాజం ద్వారా భర్తీ చేయాలనేది ప్రజల ఆకాంక్షగా గోర్డాన్ పేర్కొన్నారు. శిలాజ ఇంధనాల నిర్మూలన దిశగా వేగవంతమైన పురోగతికి స్పష్టమైన లక్ష్యా లను అంగీకరించడానికి ఈజిప్టులో జరిగిన కాప్27 శిఖరాగ్ర సమావేశంలో అమెరికా సహా ఇతర ప్రధాన పెట్టుబడిదారీ శక్తులు నిరాకరించడం ద్వారా ఇది నిరూపితమైందని ఆయన తెలిపారు. ఈయూ చేసిన 'లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్' ప్రతిపాదన... ప్యారిస్ ఒప్పంద కట్టుబాట్ల నుంచి బయటపడటానికి, కర్మన ఉద్గారాలను తగ్గించడంలో, భూ తాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా తగ్గించడంలో సంపన్న అభివృద్ధి చెందిన దేశాల వైఫల్యానికి చైనాను నిందించడానికి మరొక ప్రయత్నమని గోర్డాన్ వ్యాఖ్యానించారు. అమెరికా బ్యాంకులు శిలాజ ఇంధనాల నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు నిరాకరిం చడంతో ప్రపంచ ఆర్థిక పెట్టుబడిదారీ విధానాన్ని గ్రీన్‌వాష్ చేయడానికి చేసిన అన్ని ప్రయత్నాలు కూలిపోయాయని ఆయన వివరించారు.

వైసీపీ నేతల దందా

(మొదటిపేజీ తరువాయి)

స్థలం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రికి పాలన చేతకాకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌కు ఈ దుస్థితి వచ్చిందన్నారు. టీడీపీ ప్రభుత్వం పెద్దఎత్తున టిడ్కో ఇళ్లు నిర్మించిందని, ఆ ఇళ్లను సైతం జగన్ ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేయలేకపోతోందని విమర్శించారు. టిడ్కో ఇళ్ల పంపిణీ కోసం లబ్ధిదారుల తరపున డిసెంబర్ 5న మండల కేంద్రా లలో ఆందోళనలు చేస్తామని, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. అనంతపురం జిల్లాలో రైతుల ఇబ్బందులు వర్ణనాతీతమని, అధిక వర్షాలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, క్రాప్ హాలిడే తప్ప రైతులకు ప్రత్యామ్నాయం కనిపించడం లేదని రామకృష్ణ తెలిపారు. అనంతపురం జిల్లాకు టీడీపీ ప్రభుత్వం కియా పరిశ్రమ తెచ్చిందని, వైసీపీ ప్రజాప్రతినిధుల దందా కారణంగా ఐదువేల మంది మహిళలకు జీవనోపాధి కల్పించే జాకీ పరిశ్రమ వేరే రాష్ట్రానికి వెళ్లిపోయిందని రామకృష్ణ విమర్శించారు. జాకీ పరిశ్రమ కోసం ఆందోళన చేస్తున్న సీపీఐ, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జగన్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సమైక్య ఉద్యమం అనంతపురం నుంచే ప్రారంభిస్తామని రామకృష్ణ ప్రకటించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు వరం ఫసల్ బీమా

(మొదటిపేజీ తరువాయి)

చేశాయని ఆయన పేర్కొన్నారు. గడచిన ఐదేళ్లలో రైతుల లబ్ధి కోసం ఈ పథకానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.265 లక్షల కోట్లు ఇవ్వగా రైతులకు కేవలం రూ.87,320 కోట్లు మాత్రమే చెల్లించాయని పేర్కొన్నారు. ఈ పథకం కింద ప్రభుత్వ బీమా రంగం 90శాతం రైతుల అర్జీలను పరిష్కరించింది. భారతి, ఏఎక్స్‌ఏ, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరల్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలు తక్కిన రైతు అర్జీలను పరిష్కరించడంలో రూ.39,201 కోట్లను రైతులకు చెల్లించకుండా స్వాహా చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి. కార్పొరేట్ కంపెనీలు భారీ కుంభకోణానికి పాల్పడ్డాయి. విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్ ఈ అంశంపై ఇప్పటికే వ్యవసాయ శాఖమంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు లేఖ రాసినట్లుగా తెలుస్తోంది. ఒడిశాలో జరిగిన కుంభకోణాన్ని ఉదహరిస్తూ ధర్మేంద్ర లేఖ రాశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో అత్యంత తీవ్రమైన ఈ కుంభకోణంపై కార్పొరేట్లు ఎంత దారుణంగా రైతులను మోసగించారో ప్రజలకు వెల్లడించేందుకుగాను కాగ్ ఆడిట్ జరపాలని విశ్వం తన లేఖలో ప్రధానమంత్రిని డిమాండ్ చేశారు. బీమా చెల్లింపులో రైతులను మోసగించిన ప్రైవేటు కంపెనీలను బ్లాక్‌లిస్టులో చేర్చాలని ఆయన కోరారు. ఫసల్ బీమా పథకాన్ని కేవలం ప్రభుత్వ బీమా కంపెనీలకు మాత్రమే అప్పగించాలని విశ్వం తన లేఖలో సూచించారు.

ప్రతి విడతకు తగ్గుతున్న లబ్ధిదారులు

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి-కిసాన్ పథకాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న తీరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే సోమవారం దుయ్యబట్టారు. ప్రతి విడతకు లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయిందని ఆరోపించారు. ఖడ్గే తన అభిప్రాయాన్ని వివరిస్తూ ట్విట్టర్‌లో ఒక గ్రాఫ్‌ను పోస్టు చేశారు. 'ఆహారం అందించే రైతుల హక్కులను హరించడమే మోదీ ప్రభుత్వ విధానం. పీఎం-కిసాన్ పథకం ద్వారా 14.5 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూర్చడం గురించి పెద్ద చర్చ జరిగింది' అని ఆయన హిందీలో ట్వీట్ చేశారు. 'విడతల వారీగా లబ్ధి పొందుతున్న రైతుల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నది వాస్తవం. ఎవరికి మేలు చేసేందుకు మోదీ, రైతుల హక్కులను హరిస్తున్నారు' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశ్నించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) కింద అర్హులైన రైతులకు ప్రతి నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున మూడు సమాన వాయిదాలలో సంవత్సరానికి రూ.6 వేల ఆర్థిక ప్రయోజనం అందించబడుతుంది. నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు.

మత్స్యకారులకు జగన్ టోకరా

ఎమ్మెల్యే డోల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ హయాంలో మత్స్యకారులకు మేలు జరిగితే, సీఎం జగన్ వారికి టోకరా వేసి తీవ్ర అన్యాయానికి గురి చేశారని టీడీపీ ఎమ్మెల్యే డోల బాల వీరాంజనేయ స్వామి సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ రూ.4 వేలు ఇచ్చిందని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక మత్స్యకార భరోసాను రద్దు చేశారన్నారు. మూడున్నరేళ్ల పాలనలో ఒక్క మత్స్యకారుడికి వల, బోటు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వలలు తెగిపోయినా, బోటులు దెబ్బతిన్నా కనీసం మరమ్మత్తులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. టీడీపీ హయాంలో డ్యామేజీ బోట్ల స్థానంలో కొత్త బోట్లు, కొత్త వలలు ఇచ్చామని, చేపలకు డ్రైయింగ్ ప్లాట్ ఫామ్‌లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ప్రకాశం జిల్లాలో మత్స్యకార దినోత్సవాన్ని తీర ప్రాంతాల్లో చేయకుండా సుదూరంగా ఉన్న ఎర్రగుండపాలెంలో చేయడం వారిపై ఉన్న ప్రేమను తెలియజేస్తోందన్నారు.

సీఎం సభలకు డ్వాక్రా మహిళలు: ఆచంట సునీత

సీఎం జగన్ బహిరంగ సభలకు డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీలు, విద్యార్థులను బలవంతంగా తరలించడం నిత్యకృత్యమైపోయిందని తెలుగునాడు అంగన్‌వాడీ సాధికార సంఘం అధ్యక్షురాలు ఆచంట సునీత సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. భారీగా జన సమీకరణ చేయాలన్న లక్ష్యంతో డ్వాక్రా మహిళలను బెదిరించి సభలకు తరలించడం జగన్ నియంత పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబు పర్యటనలకు స్వచ్ఛందంగా పోటెత్తుతున్న జనాన్ని చూసి జగన్‌లో ఓటమి భయం పట్టుకుందన్నారు. ఓట్ల ద్వారా జగన్‌కు బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

జాతీయ ఏకాభిప్రాయం వల్లే

గవర్నర్లకు ఛాన్సలర్ పదవి

- రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టంతో పనిలేదు
- కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్



కొచ్చి: 'జాతీయ సమావేశం'... 'జాతీయ ఏకాభిప్రాయం' ద్వారా గవర్నర్లు వారి స్థానం ఆధారంగా ఛాన్సలర్ పదవిని కలిగి ఉంటా రని, 'ఏ రాష్ట్ర ప్రభుత్వ ఇష్ట ప్రకారం కాదు' అని కేరళ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్ సోమవారం అన్నారు. విశ్వవిద్యాలయాల నియామకాల్లో ఆశ్రిత పక్షపాతాన్ని అనుమతిం చలేమని, ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు తన కార్యాలయంలో ఏమి జరుగుతుందో తెలియకపోతే ఆయన అసమర్థుడని ఖాన్ అన్నారు. కన్నూర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌కు బంధువును నియమించాలని తన కార్యాలయం నుంచి ఎవరో ఆదేశాలు జారీ చేస్తున్నారో సీఎంకు తెలియదా అని విజ యన్‌పై మండిపడ్డారు. అతను ఎంత అసమ ర్థుడో అది తెలియజేస్తోందని అన్నారు. 'అతనికి (సీఎం) దాని గురించి తెలిస్తే, అతను కూడా అంతే దోషి' అని ఖాన్ ఢిల్లీ నుంచి వచ్చిన ఒక రోజు తర్వాత ఇక్కడ అన్నారు. విశ్వవిద్యాలయాలలో 'ప్రక్షాళన చట్టం' జరుగుతోందా అనే ప్రశ్నను కూడా ఆయన తిరస్కరించారు. 'ప్రక్షాళన చర్య కాదు. విశ్వవిద్యాలయాలను తిరిగి పూర్వ వైభవానికి తీసుకురావాలి. వారు ఈ బంధుప్రీతి నుంచి విముక్తి పొందాలి' అని ఖాన్ అన్నారు. విశ్వ విద్యాలయాలలో కార్యనిర్వాహక జోక్యం లేకుండా చూసుకోవడమే ఛాన్సలర్‌గా తన కర్తవ్యమని, అందుకే గవర్నర్లు తమ పదవి స్థానం ఆధారంగా ఛాన్సలర్ పదవిని నిర్వహి స్తారని ఆయన అన్నారు. '1956లో కేరళ ఉనికిలోకి రాకముందే గవర్నర్ విశ్వవిద్యా లయాలకు ఛాన్సలర్‌గా ఉన్నారు. దీనిపై జాతీయ సమావేశం ఏర్పడి, జాతీయ ఏకాభిప్రాయం ఏర్పడింది. తద్వారా విశ్వవిద్యా లయాలలో కార్యనిర్వాహక జోక్యం ఉండదు. వాటి స్వయంప్రతిపత్తి కాపాడబడుతుంది. 'వారు జాతీయ సమావేశాన్ని లేదా జాతీయ ఏకాభిప్రాయాన్ని విచ్ఛిన్నం చేయలేరు. అది వారి శక్తికి మించినది. వారు ప్రయత్నించనివ్వండి' అని ఆయన సోమవారం ఉదయం తిరువనంతపురం బయలుదేరే ముందు ఎర్నాకులంలో విలేకరులతో అన్నారు.

పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి: వాసిరెడ్డి

ఆర్సీ ఎగ్జామ్ యాప్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోటీ పరీక్షల్లో మహిళా అభ్యర్థులు విజయం సాధించాలని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆకాంక్షించారు. పోటీ పరీక్షల్లో శిక్షణ పొందేందుకు రైట్ ఛాయిస్ అకాడమీ అధినేత మెండెం కిరణ్ కుమార్ రూపొందించిన ఆర్సీ ఎగ్జామ్ యాప్‌ను విజయవాడలో సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రూప్ పరీక్షలతో పాటు, పోలీస్ ఉద్యోగ శిక్షణార్థులకు ఉపయోగపడేలా ఈ యాప్‌ను రూపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అత్యున్నత అధ్యాపకులతో రెండు వేల వీడియో తరగతులతో పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే అభ్యర్థులు సమగ్రంగా శిక్షణ పొందేందుకు ఈ యాప్ తయారు చేశారన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఈ యాప్‌ను ఉచితంగా డౌన్ లోడ్ చేసుకోవచ్చని సూచించారు. సిలబస్ మెటీరియల్ నామమాత్రపు రుసుంతో అందజేస్తారన్నారు. సినీ నటుడు పుష్ప సురేష్ పాల్గొన్నారు.

ఇక ఆమరణ దీక్ష

రైతు సమస్యలు పరిష్కరించాల్సిందే: దలేవాల్

చండీగఢ్: రైతుల డిమాండ్లను పంజాబ్ ప్రభుత్వం పరిష్కరిం చేంత వరకూ తన నిరవధిక నిరాహారదీక్ష కొనసాగుతుందని భారతీ కిసాన్ యూనియన్(ఏక్తా సిద్ధుపూర్) అధ్యక్షుడు జగ్జిత్‌సింగ్ దలేవాల్ సోమవారం స్పష్టంచేశారు. మరోవైపు, దలేవాల్‌కు సుగర్ పడిపోయిందని, దీక్షాశిబిరం ఫరీద్‌కోట్ వద్ద వైద్యుల బృందాన్ని ఉంచాల్సిన అవసరం ఉందని రైతు నేత ఆరోగ్యాన్ని పరీక్షించిన డాక్టర్లు చెప్పారు. రైతుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ జగ్జిత్‌సింగ్ దలేవాల్ శనివారం నుంచి ఆమరణ దీక్ష చేస్తున్నారు. మరోవైపు రైతులు సాగిస్తున్న నిరసనలు సోమవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. రైతుల డిమాండ్లకు మద్దతుగా అమృత్‌సర్, మన్సా, పటియాలా, ఫరీద్‌కోట్, భటిండాలలో బీకేయూ ఆందోళ నలు కొనసాగిస్తోంది. రైతు చట్టాల రద్దు కోసం అన్నదాతలు సాగించిన ఆందోళన సమయంలో బీజేపీ ఏ విధంగా వ్యవహరిం చిందో...ఇప్పుడు ఆప్ ప్రభుత్వం కూడా అది విధానం పాటిస్తోం దని దలేవాల్ ఆరోపించారు. 'మా డిమాండ్ల సాధన కోసం మేమిక్కడ కూర్చున్నాం. మా డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించక పోతే ఇదే ఆమరణ దీక్షగా మారుతుంది. మా ఆందోళనలు ఉధృతమవుతాయి' అని దలేవాల్ విలేకరులకు స్పష్టంచేశారు.

ఉద్యోగ కల్పనపై బడ్జెట్ దృష్టిపెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమ వర్గాలు తెలిపాయి. జీఎస్‌టీ, వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబుల హేతుబద్ధీకరణ ద్వారా పన్ను వసూళ్లు పెరిగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాయి.

దేశ ఆర్థిక వ్యవస్థపై అంతర్జాతీయ ప్రతికూల పరిణామాల ప్రభావం మరికొంతకాలం కొనసాగుతుందని భారత పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు సంజీవ్ బజాజ్ అన్నారు. దేశీయ అంశాలను బలోపేతం చేసుకోవడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగ కల్పన పెంచడం ద్వారా వినియోగం పుంజుకొని వృద్ధి ఊపందుకుంటుందని వివరించారు. ప్రస్తుత కార్పొరేట్ పన్నులను అలాగే కొనసాగిస్తూ వ్యాపారాలకు దన్నుగా నిలవాలని, పన్ను చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పన్ను వివాద పరిష్కారాలను తగ్గించే దిశగా చర్యలు సూచించారు. ఉద్యోగ సృష్టి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఉద్యోగ ఆధారిత రాయితీ పథకాన్ని ప్రవేశపెట్టాలని సీఐఐ సూచించింది. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని తెలిపింది. ఈ బడ్జెట్‌లోనే ప్రయోగాత్మక ప్రాజెక్టును ప్రతిపాదించాలని కోరింది.

25న ఆర్థిక మంత్రులతో సమావేశం

ముందస్తు బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈ నెల 25న ఢిల్లీలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో సమావేశం కానున్నారు. ఫిబ్రవరి 1న ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై చర్చించనున్నారు. ఈ నెల 22న వ్యవసాయం, వ్యవసాయ శుద్ధిరంగం, ఆర్థిక రంగం, స్టాక్ మార్కెట్లు, 24న సేవలు, వాణిజ్యం, ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, తాగునీరు, పారిశుద్ధ్య రంగాల వారితో, 28న కార్మిక సంఘాలు, ఆర్థిక నిపుణులతో సమావేశం కానున్నారు.

కోషియారీని పంపేయండి

(మొదటిపేజీ తరువాయి)

చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదమయ్యా యని, ఆయన పదేపదే శివాజీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఛత్రపతి శివాజీ ఆదర్శాలు, ఆయన సిద్ధాంతాలకు చావు లేదని, అన్ని కాలాల్లోనూ అవి ఆచరణాత్మకమైనవని, ఈ విషయాన్ని గవర్నరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని గైక్వాడ్ హితవు పలికారు. ప్రపంచంలో ఏ గొప్ప నాయకులతోనూ శివాజీ మహరాజ్‌ను పోల్చలేమన్నారు. మహారాష్ట్ర చరిత్ర, దాని గొప్పదనం గురించి తెలియని వ్యక్తులను ఇతర ప్రాంతాలకు పంపాల్సిన అవసరం ఉందని కేంద్రంలోని బీజేపీ నాయకులకు ఖరాఖండిగా చెప్పారు. మరాఠా రాజు శివాజీ పేరును ప్రస్తావించే అధికారం బీజేపీకి లేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. శివాజీ గురించి గవర్నరు కోశ్యారీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ సమర్థించడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ఛత్రపతి శివాజీ పాత రోజుల్లో నాయకుడని గవర్నరు చేసిన వ్యాఖ్య లపై ఎన్‌సీపీ అధ్వర్యంలో సోమవారం పూనెలో నిరసనలు జరిగాయి. కోషియారీ వేషధా రణతో ఓ ఎన్‌సీపీ కార్యకర్త ఆందోళనలో పాల్గొని గవర్నరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సుప్రియా సూలే విలేకరులతో మాట్లాడుతూ భారత్‌లోని గొప్ప గొప్ప నాయకుల గురించి గవర్నరు పదేపదే ఇలా మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'బీజేపీ ప్రతినిధి మాట్లాడిన వీడియోను ప్రసార మాధ్యమాల్లో సర్క్యులేట్ చేశారు. 'ఛత్రపతి శివాజీని తరచూ అవమా నిస్తూ ఇలాంటి నాయకులు మాట్లాడటం దారుణం. ఇది దురదృష్టకరం. ఇలా మాట్లాడటం తక్షణం ఆపేయాలి' అని సూలే డిమాండ్ చేశారు. మొఘలు సామ్రాజ్యాధినేత ఔరంగాజేబుకు శివాజీ మహరాజ్ ఐదుసార్లు క్షమాపణ చెప్పారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేదీ చేసిన వ్యాఖ్యలపై సూలే ఆగ్రహం వెలిబుచ్చారు.

శివాజీపై అనుచిత వ్యాఖ్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ ఎన్‌సీపీ, శివసేన, కాంగ్రెస్ ఆందోళనకు దిగాయని ప్రియాంకా సూలే చెప్పారు. గవర్నరు ప్రకటనను ఉపముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సమర్థించిన విషయాన్ని పాత్రికేయులు గుర్తు చేయగా ప్రతిపక్షం ఏమి మాట్లాడినా తప్పయినప్పుడు బీజేపీ మాట్లాడితే ఎందుకు కాదని ఆమె ప్రశ్నించారు. ఇది బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'ఫడ్నవిస్ నుంచి నేను ఎక్కువగా ఊహించాను. ఆయన ఐదేళ్లు ముఖ్యమంత్రిగా చేశారు. మీకు విభిన్న సిద్ధాంతాలు ఉండవచ్చు. మరాఠా వీరుడు శివాజీ మహరాజ్‌ను అవమానిస్తే...మీరు దానిని ఎలా సమర్థిస్తారు? ఇది విచారకరం. అందుకే ఛత్రపతి శివాజీ పేరును ప్రస్తావించే హక్కు బీజేపీకి లేదు' అని ఆమె స్పష్టంగా చెప్పారు. ఒక్కసారి మాట్లాడితే దానిని పొరపాటని అనుకోవచ్చు. కానీ గవర్నరు కోశ్యారీ పదేపదే అంటున్నారు. ఇది పొరపాటున అంటున్న మాటకాదు. ఉద్దేశపూర్వకంగానే గవర్నరు వ్యాఖ్యలు చేస్తున్నారని సూలే విమర్శించారు.

అక్రమ కేసులపై అధైర్యపడొద్దు

జనసేన పీఏసీ సభ్యుడు నాగబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అక్రమ కేసులపై పార్టీ శ్రేణులు అధైర్యపడవద్దని జనసేన పీఏసీ సభ్యుడు కొణిదెల నాగబాబు అన్నారు. సోమవారం హైదరాబాదులో నాగబాబును ప్రకాశం జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా జనసేన నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారం కోసం ధర్మబద్ధంగా పోరాటం చేస్తున్న జన సేన శ్రేణులు, మహిళా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయాందోళనకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అధైర్యపడవద్దని కార్యకర్తలకు సూచించారు. జనసేన క్షేత్రస్థాయిలో బలపడుతున్న విధానాన్ని చూసి తట్టుకోలేక వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులతో కార్యకర్తలను అణచి వేయాలని చూస్తే సహించబోమన్నారు. ప్రతి గ్రామంలోనూ పార్టీ శ్రేణులంతా సంఘటితంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనం తరం పార్టీ కోసం సేకరించిన విరాళాల చెక్‌లను నాగబాబుకు నేతలు అందజేశారు.

అందినకాడికి అమ్మేసెయ్!

(మొదటిపేజీ తరువాయి)

ప్రచారం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పీఎస్‌యూలు చెల్లిస్తున్న డివిడెండ్లు నిగ్గుతేల్చిన నిజమిది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వేసిన ఒక పిటిషన్‌కు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) ఇచ్చిన వివరాలు ఇవి.

అంచనాలకు మించి డివిడెండ్లు

కంపెనీలు తమకు వచ్చిన లాభాల్లో కొంత మొత్తాన్ని వాటాదారులకు డివిడెండ్ల రూపంలో చెల్లిస్తాయి. గడిచిన ఎనిమిదేళ్లలో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో (సీపీఎస్‌యూల్లో) రూ.4.5 లక్షల కోట్ల వాటాలను కేంద్ర సర్కారు విక్రయించినప్పటికీ, ఇంకా ఆయా సంస్థల్లో కేంద్రానికి మరికొన్ని వాటాలు మిగిలే ఉన్నాయి. దీంతో తాము గడించిన లాభాల్లో సీపీఎస్‌యూలు కేంద్రానికి ఏటా చెల్లింపులు చేస్తూ వస్తున్నాయి. అయితే, కేంద్రం బడ్జెట్ అంచనాలకు మించి సీపీఎస్‌యూలు డివిడెండ్లు చెల్లిస్తుండటం గమనార్హం. ఉదాహరణకు... 2020-21 ఆర్థిక సంవత్సరం సీపీఎస్‌యూల ద్వారా కేంద్రం అంచనా వేసిన డివిడెండ్ రూ.34,717 కోట్లుగా ఉంటే, ఆయా సంస్థలు రూ.39,750 కోట్లు (12.6 శాతం ఎక్కువ) డివిడెండ్‌గా చెల్లించాయి. ఆ మరుసటి ఆర్థిక సంవత్సరం అంటే 2021-22లో కేంద్రం డివిడెండ్ అంచనా రూ. 46 వేల కోట్లుగా ఉంటే, సీపీఎస్‌యూలు రూ.59,101 కోట్లు (28 శాతం ఎక్కువ) డివిడెండ్‌గా చెల్లించాయి. ఈ ఏడాది గడిచిన ఆరు నెలల్లో రూ.18,719 కోట్లను సీపీఎస్‌యూలు కేంద్రానికి డివిడెండ్లుగా చెల్లించాయి. ఈ మేరకు కేంద్ర బడ్జెట్ పత్రాలు-దీపమ్ వెల్లడించాయి. లాభాలు గడించనదే... సీపీఎస్‌యూలు ఇంత పెద్దమొత్తంలో ప్రభుత్వానికి డివిడెండ్లు ఎలా చెల్లించగలవని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థలు నష్టాల్లో ఉన్నాయన్న కేంద్ర సర్కారు మాటలు అబద్ధాలని ధ్వజమెత్తుతున్నారు. ఏ కంపెనీ అయిన తమ శాఖలను విస్తరించడానికి వచ్చిన లాభాలను పెట్టుబడుల రూపంలో మళ్లిస్తాయి. అయితే సీపీఎస్‌యూల విస్తరణను వ్యతిరేకిస్తున్న కేంద్రం వాటిని ప్రైవేటీకరించడానికే పట్టుబడుతున్నది. ఈ క్రమంలోనే కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. కేంద్రం వాటా ఉన్న ఏ సీపీఎస్‌యూ అయినా... వచ్చిన లాభాల్లో 30 శాతాన్ని (పన్నులు కాకుండా) లేదా నికర విలువలో 5 శాతాన్ని... ఈ రెండింట్లో ఏది ఎక్కువ అయితే దాన్ని, కేంద్రానికి డివిడెండ్ల రూపంలో చెల్లించాలని నిబంధన తీసుకొచ్చింది. దీంతో ఏటికేడు లాభాలు గడిస్తున్నా, కేంద్రం కొర్రీలతో సీపీఎస్‌యూలు విస్తరణకు నోచుకోవడంలేదు. నిబంధనలకు లోబడి గత ఎనిమిదేళ్లలో సీపీఎస్‌యూలు రూ.3,25,132 కోట్లు కేంద్రానికి చెల్లించాయి.

ఇండోనేషియాలో భారీ భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

అవకాశాలు లేవని ప్రభుత్వ వాతావరణ, జియోఫిజిక్స్ సంస్థ బీఎంకేజీ వెల్లడించింది. కాగా భూకంపం అనంతరం కూడా ఇక్కడ 25 వరకు ప్రకంపనలు నమోదయ్యాయి. జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలను ప్రారంభించాయి. అనేక ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని, నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. భూకంపం సంభవించడంతో నివాసితులు, కొంతమంది పిల్లలతో ఏడుస్తూ, దెబ్బతిన్న ఇళ్ల నుండి పారిపోయారు. ఇది గ్రేటర్ జకార్తా ప్రాంతంలో కూడా భయాందోళనలకు కారణమైంది, ఇక్కడ ఎత్తైన ప్రదేశాలు ఊగిస లాడాయి. కొంతమందిని ఖాళీ చేయించారు. సియాంజూర్‌లోని సహాయక బృందాలు, పౌరులు కూలిపోయిన ఇటుక ఇళ్ల శిథిలాలలో చిక్కుకున్న ఇతరుల కోసం వెతుకు తున్నారు. 'భూకంపం చాలా బలంగా అనిపించింది. నేను, నా సహోద్యోగులు తొమ్మిదో అంతస్తులో ఉన్న మా కార్యాలయం నుంచి అత్యవసర మెట్లను ఉపయోగించి బయటకు వెళ్లాలని నిర్ణయించుకున్నాము' అని దక్షిణ జకార్తాలోని ఉద్యోగి విది ప్రిమధానియా చెప్పారు. సోమవారం సాయంత్రం మృతుల సంఖ్య 56కు చేరిందని సియాంజుర్ రీజెన్సీ అధిపతి హెర్మన్ సుహెర్మాన్ తెలిపారు. దాదాపు 700 మంది గాయపడ్డారని జాతీయ విపత్తు నివారణ సంస్థ చీఫ్ సుహర్యంతో తెలిపారు. అలాగే సియాంజుర్ చుట్టూ అనేక కొండచరియలు విరిగిపడినట్లు సమాచారం. దెబ్బతిన్న డజన్ల కొద్దీ భవనాలలో ఇస్లామిక్ బోర్డింగ్ స్కూల్, ఆసుపత్రి, ఇతర ప్రజా సౌకర్యాలు ఉన్నాయని తెలుస్తోంది. విశాలమైన ద్వీపసమూహ దేశంలో భూకంపాలు తరచుగా సంభవిస్తాయి. పసిఫిక్ బేసిన్‌లోని అగ్నిపర్వతాలు, ఫాల్ట్ లైన్‌ల ఆర్క్ అయిన 'రింగ్ ఆఫ్ ఫైర్' పై దాని స్థానం కారణంగా 270 మిలియన్ల కంటే ఎక్కువ జనాభా ఉన్న దేశం తరచుగా భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, సునామీల బారిన పడుతోంది. ఫిబ్రవరిలో పశ్చిమ సుమత్రా ప్రావిన్స్‌లో 6.2 తీవ్రతతో సంభవించిన భూకంపం వల్ల కనీసం 25 మంది మరణించగా, 460 మందికి పైగా గాయపడ్డారు.

వారిని నమ్మకండి

- టీడీపీ.. తెలుగు బూతుల పార్టీ
- జనసేనను... రౌడీసేన చేశారు
- పశ్చిమ పర్యటనలో సీఎం జగన్

విశాలాంధ్ర-నరసాపురం: టీడీపీని తెలుగు బూతుల పార్టీగా, జనసేనను రౌడీసేనగా మార్చేశారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో రూ.3300 కోట్ల విలువైన 15 అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ గత ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు బైబై చెప్పారన్నారు. అన్ని ఎన్నికల్లో మన ప్రభుత్వాన్ని ఆశీర్వదించారనీ, చివరికి కుప్పంలో కూడా వైసీపీనే గెలిపించారని సీఎం గుర్తు చేశారు. "టీడీపీని చిత్తుగా ఓడించి మరోసారి బైబై బాబు అని చెప్పారు. వాళ్ల పాలన చూసి ప్రజలు ఇదే కర్మరా బాబు అనుకుని ఉంటారు. అందుకే 2019లో వారికి ప్రజలు బైబై చెప్పారు" అని సీఎం అన్నారు. వెన్నుపోటుకు గురైన ఎన్టీఆర్ కూడా ఇలాంటి మనిషికి తన ఇంట్లో, తన పార్టీ కేబినెట్‌లో స్థానం ఇచ్చినందుకు ఇదేం ఖర్మరా బాబు అనుకుని ఉంటారని సీఎం ఎద్దేవా చేశారు. ఇక ఆవేశం తప్ప.. ఆలోచన లేకుండా పవన్ మాట్లాడుతున్నారని, రాష్ట్రమంతటా జనసేన కార్యకర్తలు రౌడీల్లా ప్రవర్తిస్తుంటే జనం భయాందోళనలకు గురవుతున్నారన్నారు.

అంతకుముందు నరసాపురంలో సీఎం జగన్ శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాలను నూరు శాతం నెరవేర్చేలా, ప్రజలందరూ వైసీపీకి అండగా ఉండాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కోరారు. ఒకే రోజు ఇన్ని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం అన్నది బహుశా నరసాపురం చరిత్రలోనే మునుపెన్నడూ జరిగిన దాఖలాలు లేవని సీఎం అన్నారు. నరసాపురం పట్టణం, ఈ నియోజకవర్గం రూపురేఖలు అన్నీ మార్చేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ ప్రాంతంలో ఆక్వా కల్చర్ ప్రధానమైన వనరుగా ఉందని, మెరైన్ ఎక్స్‌పోర్ట్స్, మెరైన్ ప్రొడక్షన్‌లో రాష్ట్రం దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో ఉందన్నారు. ఆక్వాకల్చర్‌కు సంబంధించిన నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలని, ఆక్వా కల్చర్ సుస్థిర అభివృద్ధి కోసం ఫిషరీస్ పాలిటెక్నిక్ డిప్లొమా హోల్డర్లు, బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ డిగ్రీ విద్యార్థులు, మాస్టర్ ఆఫ్ ఫిషరీస్ (పీజీ డిగ్రీ హోల్డర్లు).. ఇలా ఆక్వా కల్చర్‌లో మానవ వనరుల కొరత తీర్చేందుకు డిప్లొమో నుంచి పీహెచ్‌డీ వరకు విద్య కోసం మన ప్రభుత్వం నరసాపురంలో ప్రత్యేకంగా ఫిషరీస్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.332 కోట్ల వ్యయంతో ఆక్వా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో గంగపుత్రులకు మేలు జరిగే విధంగా రూ.430 కోట్లు వ్యయం బియ్యపు తిప్ప వద్ద హార్బర్‌కు శంకుస్థాపన చేశామన్నారు. మత్స్యకారు దినోత్సవ సందర్భంగా 23,458 మంది గంగపుత్రులకు రూ.108 కోట్ల పరిహారం విడుదల చేశామని తెలిపారు. బ్రిటిష్ కాలం నుంచి 99 సంవత్సరాలకు లీజుకు తీసుకుని సాగు చేసుకుంటున్న 1623 మంది రైతన్నల కుటుంబాలకు మంచి జరిగేలా వారి పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి వారికి అన్ని రకాల హక్కులు కల్పిస్తున్నామన్నారు. సముద్రపు నీరు కొల్లేరు సరస్సులోకి రాకుండా..మంచినీరు రైతులుకు ఇంకా మెరుగ్గా ఉపయోగపడే విధంగా.. కొల్లేరులో 5వ కాంటూరు వరకు మంచినీరు నిలువ ఉండేలా ఉప్పుటేరు నదిమీద మూలపర్రు సమీపంలో రూ.188 కోట్లతో రెగ్యులేటర్ కమ్ బ్రిడ్జి కమ్ లాక్ నిర్మాణం చేపడతామన్నారు. నరసాపురంలో రూ.13 కోట్లతో ఏరియా ఆసుపత్రి కోసం కొత్త భవనం జాతికి అంకితం చేశామన్నారు. విద్యుత్ కొరత తీర్చడానికి రుస్తుంబాద విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి రూ.132 కోట్లు మంజూరు చేశామన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆక్వాకల్చర్‌తో తీరప్రాంతాల్లో ఉప్పునీటి సాంద్రత, తీవ్ర తాగునీటి ఎద్దడి సమస్యకు పరిష్కారంగా రూ.1400 కోట్ల వ్యయంతో వాటర్ గ్రిడ్ ద్వారా రక్షిత నీటి సరఫరా ప్రాజెక్టు నిర్మించి తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా నూతన జిల్లాలైన పశ్చిమగోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లోని నిడదవోలు, తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, ఉంగుటూరు, ఏలూరు, తాడేపల్లి గూడెం శాసనసభ నియోజకవర్గాల ప్రజలకు, కృష్ణా జిల్లాలోని కృతివెన్ను, బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరు మండలాలో ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేస్తామని వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా ఇన్చార్జి మంత్రి దాడిశెట్టి రాజా, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు, హోంమంత్రి తానేటి వనిత, జల వనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, అమలాపురం, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యులు చింత అనురాధ, మార్గాని భరత్ రామ్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ వెంకటరమణ, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, తెల్లం బాలరాజు, ఉన్నమట్ల ఎలిజా, గ్రంధి శ్రీనివాస్, చెరుకువాడ శ్రీ రంగనాథరాజు, తలారి వెంకట్రావు, పేర్ని నాని, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు, ఎస్పీ యు రవి ప్రకాష్, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ నిర్మాణానికి కార్యకర్తలు కృషి చేయాలి: జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర-పాడేరు (అల్లూరి జిల్లా): కొత్త జిల్లాలో పార్టీ నిర్మాణంపై ప్రతి ఒక్క కార్యకర్త దృష్టి సారించాలని, పార్టీ కార్యాలయం, సొంత భవనం నిర్మించుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి సూచించారు. పాడేరు పార్టీ కార్యాలయంలో అల్లూరి సీతారామ రాజు జిల్లా సమితి సమావేశం మొట్టడం రాజుబాబు అధ్యక్షత సోమవారం జరిగింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభించాలని, పార్టీ కార్యాలయం నిర్మాణం, బలోపేతం, నిధి వసూలు, డిసెంబర్ 26 పార్టీ ఆవిర్భావ దినోత్సవం అల్లూరి జిల్లాలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచారు. కేంద్రంలో నరేంద్ర మోదీ పాలన, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని, పెద్ద ఎత్తున పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు బిమలమ్మ, సింహాచలం, విష్ణుమూర్తి, రాజబాబు, కూడా రాధాకృష్ణ, మారుతి కుమార్, లక్ష్మణరావు, సత్తిబాబు, మండల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ మహాసభల్లో

మోదీ వినాశకర విధానాలపై చర్చ

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: డిసెంబరు 16 నుంచి 20 వరకు కేరళలోని అలెప్పి నగరంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ మహాసభల విజయవంతానికి కృషిచేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ విశాఖ జిల్లా సమితి సమావేశం టౌన్ కొత్త రోడ్డులో ఉన్న పోర్టు యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓబులేసు మాట్లాడుతూ, జాతీయ మహాసభలకు అన్ని రాష్ట్రాల నుంచి దాదాపు 2వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. చివరి రోజు రెండు లక్షల మందితో బహిరంగ సభ జరుగుతుందని, ఈ మహాసభల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్మిక వర్గం ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తయారు చేసి కార్పొరేట్ అనుకూలంగా మార్పులు చేస్తున్నారని, దీనికి ఏఐటీయూసీ పూర్తి వ్యతిరేకమని తెలిపారు. అసంఘటితరంగంలో ఉన్న 40 కోట్ల మంది కార్మిక వర్గానికి ఎటువంటి హక్కులు లేకుండా కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఒడిగడుతోందన్నారు. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు పట్టుకొమ్మలుగా ఉంటే వాటిని ప్రైవేటు వ్యక్తులకు కారు చౌకగా అమ్మేందుకు ప్రయత్నిస్తోందని విమ ర్శించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పడాల రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం మన్మధరావు, అదనపు ప్రధాన కార్యదర్శి బి వెంకట్రావు, నాయకులు బి సత్య ఆంజనేయ, జె.రామకృష్ణ, మౌలాలి. పి.అప్పారావు, కె.ఆనంద్, రాజుబాబు, సత్యనారాయణ, వెంకటేశ్, కే సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కుపై పోరు తప్పదు

గుజ్జుల ఈశ్వరయ్య హెచ్చరిక

విశాలాంధ్ర-పులివెందుల: వైఎస్ ఆర్ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై స్పందించకపోతే పోరుబాట తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య హెచ్చరించారు. పులివెందుల పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా, సెయిల్ అధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం వంటి అనేక అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని, అంతటితో ఆగకుండా ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి జగన్ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం రాయలసీమకు చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు మూడుచోట్ల శంకుస్థాపన చేశారని, అవి కేవలం పునాది రాళ్లకే పరిమితమయ్యాయని ఈశ్వరయ్య విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు రూపాయి నిధులు ఇవ్వడం లేదని, డ్రిప్ ఇరిగేషన్ పైపులకు ప్రభుత్వ సబ్సిడీ ఇవ్వడం లేదని ఆరోపించారు. అకాల వర్షాలతో పంటనష్టపోయిన రైతులకు బీమా ఇవ్వకుండా తమది రైతు పక్షపాత ప్రభుత్వమని చెప్పుకోవడం హాస్యాస్పదమని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గంగా సురేశ్, ఏరియా కార్యదర్శి వెంకట రాములు, నాయకులు కొమ్మది ఈశ్వరయ్య, మురళి, రవి, లక్ష్మీనారాయణ, వాసు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం

మహాసభల పోస్టరు ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజ మహేంద్రవరంలో ఈనెల 26, 27, 28 తేదీల్లో జరగనున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ ఏడో మహాసభల జయప్రదాయాన్ని కాంక్షిస్తూ విజయవాడ దాసరిభవన్‌లో సోమవారం ఏఐటీయూసీ నేతలు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు టి.తాతయ్య, నగర కార్యదర్శి ఎం.సాంబశివరావు భవన నిర్మాణ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా నాయకులు షేక్ ఉమ్మర్వల్లి, నగర సహాయ కార్యదర్శి చల్ల వెంకట రమణ, రామస్వామి తదితరులు హాజర య్యారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు నిరంతర శ్రమ ఫలితంగానే ప్రజాప్రతినిధులు, ప్రధానులు, గవర్నరులు, రాష్ట్రపతుల నివాస భవనాలను విలాసవంతంగా భవన నిర్మాణ కార్మికులే నిర్మించారని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులు, వారి సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సెస్సును వేల కోట్ల రూపాయలు ప్రభుత్వాలు దుర్వినియోగం చేసి ఓట్ల రాజకీయాలకు దారి మళ్లించడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ విధానాలు మార్చుకుని, కార్మిక సంక్షేమ బోర్డు రక్షించాలని డిమాండ్ చేశారు.

బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా

ప్రైవేట్ బస్, మొబైల్ టవర్ దహనం

నేడు చత్తీస్‌గఢ్‌లో బంద్‌కు మావోయిస్టుల పిలుపు

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టు పార్టీ నాయకులు దర్శన్, జాగేష్‌లను పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేయడాన్ని నిరసిస్తూ నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారు జామున ఒక ప్రైవేటు ట్రావెల్ బస్సు, మొబైల్ టవర్‌ను మావోయిస్టులు దహనం చేశారు. పంకజార పోలీస్ స్టేషన్ పరిధిలోని పీవీ 45 గ్రామంలో టవర్‌తోపాటు, అదే మార్గంలో వెళ్తున్న ప్రైవేటు బస్సును నిలుపుదల చేసి ప్రయాణికులను దించివేసి ఆ బస్సును దహనం చేశారు. దర్శన్, జాగేష్‌లను బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు హత్య చేశారని, అందుకు నిరసనగా వీటిని దహనం చేశామని, మంగళవారం కాంకేర్, నారాయణపూర్, కొండగావ్‌లో జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని ఘటన స్థలంలో కరపత్రాలు, పోస్టర్లను విడిచి వెళ్లారు. ఇద్దరు మావోయిస్టులను చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారని ఆ పార్టీ నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ కార్యదర్శి సుఖ్‌దేవ్ కౌడో ఓ ప్రకటనలో వెల్లడించారు. వారు ఒక పని నిమిత్తం మోటార్ సైకిల్‌పై ఇద్దరు సహాయకులతో కలిసి వెళ్తుండగా పోలీసు ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో వారిని అదుపులోకి తీసుకుని క్రూరంగా హింసించి హత్య చేశారని పేర్కొన్నారు. దర్శన్, జాగేష్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారని, వారి నుంచి భారీ మొత్తంలో మందుగుండు సామాగ్రి, పిస్టల్, రైఫిల్, ఇతర నిత్యావసర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ సుందర్‌రాజ్ చేసిన ప్రకటనలో వాస్తవం లేదన్నారు. వారు పూర్తిగా నిరాయుధులుగా ఉన్నారని తెలిపారు.

కద్మే జంగిల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ కథ పోలీసు పారామిలటరీ, డీఆర్‌జీ గూండాలు ఐజీ సుందర్‌రాజ్ అల్లిన కల్పిత కథ మాత్రమేనని పేర్కొన్నారు. ఇది నిజాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమన్నారు. ఉత్తర బస్తర్ డివిజనల్ కమిటీ గిరిజన, సర్వ సమాజ్, మేధావులు, విద్యార్థి యువకులు, ప్రజాస్వామిక, సామాజిక సంస్థలు, దేశభక్తి గల మేధావులు ఇటువంటి ఉగ్రవాద మారణకాండను తిరస్కరించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన గుర్తింపు, జల్-జంగిల్-జమీన్, ఉనికి , జీవనోపాధి కోసం పోరాడుతున్న గిరిజనులకు పూర్తి మద్దతు ఇవ్వాలని, నారాయణపూర్, కొండగావ్ జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని సుఖ్‌దేవ్ కౌడో పిలుపునిచ్చారు.

బీసీ విద్యార్థులకు టీడీపీ ద్రోహం

వైసీపీ బీసీ నేత నాగరాధాకృష్ణ యాదవ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నీట్ కౌన్సెలింగ్‌లో 550-జీవోకు సాంకేతిక సమస్యలను సృష్టించి, ఆ జీవోను ఐదేళ్లపాటు అమలు చేయకుండా వందలాది మంది బీసీ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసి తీవ్ర ద్రోహం చేసిన ఫలితంగా వారంతా టీడీపీకి దూరమయ్యారని వైసీపీ బీసీ నాయకుడు డాక్టర్ అంబటి నాగరాధాకృష్ణ యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. నాడు ఎంతోమంది బీసీ విద్యార్థుల భవిష్యత్తును వారి అభ్యున్నతిని అడ్డుకుని, తద్వారా యావత్ బీసీ సమాజానికి టీడీపీ ద్రోహం చేసిందని గుర్తుచేశారు. ఫీజులను రెండు వందల శాతానికి నాటి టీడీపీ ప్రభుత్వం పెంచిందనీ, దీంతో అర్హత ఉండి సీటు పొంది కూడా అంత డబ్బును చెల్లించలేక వైద్య విద్యకు చాలా మంది దూరమయ్యారన్నారు.

పామాయిల్‌కు మద్దతు ధర ప్రకటించాలి

ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-చింతలపూడి: పామాయిల్ టన్ను మద్దతు ధర రూ. 20వేలుగా నిర్ణయించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా చింతలపూడి పట్టణంలో స్థానిక సీపీఐ కార్యాలయంలో పామాయిల్ రైతుల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. వసంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా కేవీవీ ప్రసాద్ పాల్గొని, మాట్లాడారు. పామాయిల్ టన్ను మద్దతు ధర రూ.20వేలు నిర్ణయించాలని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పామాయిల్ ధర నిర్ణయించి రైతుల సమస్యలు చర్చించేందుకు వ్యవసాయ శాఖ మంత్రి జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కాలం చెల్లిన ఫ్యాక్టరీలను ఆధునీకరించాలని, పామాయిల్ మొక్కలను తక్షణ అందుబాటులోకి తెచ్చి రైతులందరికీ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని 500 రైతు సంఘాలు సంవత్సరం పాటు నిరంతరంగా పోరాటం చేసి వాటిని రద్దు చేసేవరకు ఉద్యమం ఉద్యమం చేసి ప్రధాని మోదీ మెడలు వంచి వాటిని రద్దు చేయించిన ఘనత రైతులదేనన్నారు. ఆ రోజు రైతు సంఘాలకు ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయడంలో మోదీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందన్నారు. విద్యుత్ సంస్కరణ చట్టాలని కేంద్రం నిలుపుదల చేస్తే ఈ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం నిసిగ్గుగా అమలు చేస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా డిసెంబర్ 26న దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చామని, డిసెంబర్ ఒకటి నుంచి ప్రతి పార్లమెంటు సభ్యుడిని కలిసి వినత పత్రాలు సమర్పిస్తున్నట్టు తెలిపారు. కనీస మద్దతు ధర తన్నుకు రూ. 20వేలుగా ప్రకటించాలని, మార్కెట్ ఇంటర్ వెర్షన్ స్కీమ్ అమలుపరచాలని, రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేసిన రైతులకు తక్షణం మొక్కలు పంపిణీ సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. రవాణా చార్జీలు పెంచాలని, నాణ్యతలేని మొక్కలకు కంపెనీ నష్టపరిహారం చెల్లించాలని, రైతులు కూలీలకు అందరికీ కంపెనీ ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని సమావేశం తీర్మానం చేసిందన్నారు. ఏఐటీయుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, పామాయిల్ రైతులు సూరానేని నాయన బాబు, పెనుమత్స రామరాజు, కత్తిరాల నాగేశ్వరరావు, బాణావతి, పుల్లూరి సోమశేఖర్, జంగా రామచంద్ర రెడ్డి, ఏపీ రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె కాలేషా, దొంతా కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తుర్లపాటి బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరు

విశాలాంధ్ర-నూజివీడు: రైతాంగ సమస్యలపై రైతులను చైతన్యపరచి ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నూజివీడులో రైతు సంఘం నియోజక వర్గ సమావేశం నిర్వహించారు. రైతాంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని కేవీవీ ప్రసాద్ తెలిపారు. రైతు ఉద్యమాల కారణంగా ఎన్నో విజయాలు సాధించామన్నారు. ఏలూరు జిల్లాలో రైతు సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. రైతుసంఘం నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని రామారావు, రాయంకుల లక్ష్మణరావు, బత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టమాటా మద్దతు ధరకు చర్యలు: మంత్రి కాకాని

ఫుడ్ ప్రాసెసింగ్, ఏపీ మహిళాభివృద్ధి, లారెన్స్ డేల్ ఆగ్రో త్రైపాక్షిక ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దళారుల ప్రమేయం లేకుండా టమాటా రైతులకు కనీస మద్దతు ధర కల్పించి, వారి ఆదాయం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఇంటిగ్రేటెడ్ టమాటా వేల్యూ చైన్ డెవలప్‌మెంట్‌కు జగన్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అన్నారు. దీనికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ, లారెన్స్ డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా (ప్రై) లిమిటెడ్ మధ్య త్రైపాక్షిక ఒప్పందం అమరావతి సచివాలయంలో సోమవారం మంత్రి నేతృత్వంలో కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కాకాని మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆపరేషన్ గ్రీన్స్ కింద టమాటా, ఉల్లిపాయ, బంగాళదుంప ఉత్పత్తుల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లకు సహకారాలు అందించనున్నామని వివరించారు. ఇటీవల డిమాండ్‌కు మించి దిగుబడి రావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర రాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ రూ.110 కోట్ల అంచనా వ్యయంతో 20 ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో ఎల్.శ్రీధర్‌రెడ్డి, ఏపీ మహిళా అభివృద్ధి సొసైటీ సీఈవో సీఎస్ రెడ్డి, లారెన్సు డేల్ ఆగ్రో ప్రాసెసింగ్ ఇండియా (ప్రై) లిమిటెడ్ సీఈవో పి.విజయరాఘవన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ

సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు నాగరాణి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాలిటెక్నిక్ విద్యార్థులకు గుణాత్మక పారిశ్రామిక శిక్షణ నివ్వడంతో పాటు, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లను సొంతం చేసుకోవడమే ధ్యేయంగా వ్యూహాత్మక ప్రణాళిక అమలు చేస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు చదలవాడ నాగరాణి తెలిపారు. పరిశ్రమల సహకారాన్ని కళాశాలలతో బలోపేతం చేసే క్రమంలో అనుసరించాల్సిన వ్యూహంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రిన్సిపాళ్లతో నాగార్జున విశ్వ విద్యాలయం వేదికగా సోమవారం ప్రత్యేక పునశ్చరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ పరిశ్రమ, సాంకేతిక విద్యాసంస్థ మధ్య అంతరాన్ని తగ్గించడానికి ప్రనాళిక రూపొందిస్తున్నా మన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగు ణంగా విద్యార్థులను తీర్చిదిద్ది, వారికి ఉపాధి అవకాశాలు చూపుతామన్నారు.

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ జీఎం ఎస్.భాను మాట్లాడుతూ, పారిశ్రామిక శిక్షణ, పరిశ్రమ అనుసంధానానికి తమ వంతు మద్దతు అందిస్తున్నామని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌లో ఇప్పటి వరకు 4417 మంది విద్యార్థులు శిక్షణ పొందార న్నారు. ఎఫ్‌ట్రానిక్స్ సీఈవో రామకృష్ణ మాట్లాడుతూ, దేశాభివృద్ధి పారిశ్రామిక రంగం పురో గతిపై ఆధారపడి ఉందన్నారు. మానవవనరుల పాత్ర ఎంతో ముఖ్యమైందని వివరించారు. ప్రకాష్ స్పెక్ట్రో కాస్ట్ ఎండీ పార్థసారథి, సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకులు వి.పద్మారావు, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జేఎస్ఎన్ మూర్తి, ఎ.నిర్మల్ కుమార్, ఉప సంచాలకులు రామకృష్ణ, ఎస్‌బీ టీఈటీ కార్యదర్శి కె.విజయ భాస్కర్, సంయుక్త కార్యదర్శి కె.నారాయణరావు, డీటీఈ, ఎస్‌బీటీఈటీ అధికారులు పాల్గొన్నారు.

కౌలురైతు ఆత్మహత్య



విశాలాంధ్ర-అవుకు: నంద్యాల జిల్లా అవుకు పట్టణంలోని తెలుగు పేటకు చెందిన కొవ్వూరి పాండురంగ (45) అనే రైతు అప్పులబాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు, మృతుడు తనకు ఉన్న ఒక ఎకరంతో పాటు అదనంగా 35 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేయగా సరైన దిగుబడి రాకపోవడంతో రూ.50 లక్షల వరకు అప్పులు చేశాడు. తనకున్న ఎకరం పొలాన్ని రూ. 29 లక్షలకు అమ్మి అప్పు ఇచ్చిన వారికి చెల్లించినా, ఇంకా రూ.21 లక్షలు అప్పు ఉంది. డబ్బులు చెల్లించాలని అప్పు ఇచ్చినవారు ఒత్తిడి తీసుకు రావడంతో మనస్థాపానికి గురైన పాండురంగ ఇంటిలోనే విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారని, భార్య లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

డీవైఎఫ్ఐ నేతల అరెస్టుకు సీపీఎం ఖండన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పే అండ్ ప్లే పేరుతో క్రీడాకారుల నుంచి డబ్బు వసూలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులను అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. తక్షణమే అరెస్టు చేసిన వారందర్నీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హమాలీ కార్మికుల సమస్యలపై చర్చలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హమాలీ కార్మికుల సమస్యలపై సోమవారం ప్రసాదంపాడు ఏపీఎస్ బీసీఎల్ ఎండీ కార్యాలయంలో సిగ్మా కంపెనీ, కార్పొరేషన్ అధికారులు, ఆంధ్రప్రదేశ్ బ్రేవరేజెస్ కార్పొరేషన్ హమాలీ కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో సిగ్మా కంపెనీ మేనేజర్ చౌహాన్, సీజీఎం వేణుగోపాల్, డీజీఎం కృష్ణ, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, లోకేశ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ హమాలీల కూలీల ఒప్పందం పూర్తయి 14 నెలలు గడుస్తున్నప్పటికీ, కూలి రేట్లు పెంచకపోవడం దారుణమన్నారు.

సంపాదకీయం

కోషియారీ కలహ ప్రియత్వం

గవర్నర్ల వ్యవస్థే అనవసరం అన్న వాదనలకు క్రమంగా బలం చేకూరుతున్న సమయంలో బీజేపీయేతర రాష్ట్రాలలో గవర్నర్లుగా ఉన్న బీజేపీ నాయకులు అదనపు ఆజ్యం అందిస్తున్నారు. రాజకీయ నిరుద్యోగులకు రాజ్ భవన్లు నిలయాలుగా మారాయని ఎప్పటి నుంచో విమర్శలు ఉన్నాయి. ఆర్.ఎస్.ఎస్ కుదురునుంచి వచ్చిన మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోషియారీ కొత్త వివాదానికి తెరలేపారు. ఔరంగాబాద్ లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి గౌరవ డాక్టొరేట్ ప్రదానంచేసిన సభలో పాల్గొన్న కోషియారీ శివాజీ గతకాలంలో ఎప్పుడో ఆరాధ్యుడు అయితే ఇప్పుడు మహారాష్ట్రలో అనేకమంది ఆరాధ్యులున్నారని అనడం పెద్ద వివాదానికి దారితీసింది. శివాజీ గత కాలానికి వీరుడని ఊరుకోకుండా ఈ కాలంలో ఆరాధ్యులు అంబేద్కర్ అన్నారు. అక్కడితోనూ ఆగలేదు కేంద్ర మంత్రి నితిత్ గడ్కరీని ఆకాశానికెత్తారు. అదే సభలో శరద్ పవార్‌నూ ప్రశంసలతో ముంచెత్తారు. అంటే కోషియారీ ఎవరినైనా పొగిడినా వివాదమే అవుతుందన్నమాట. ఛత్రపతి శివాజీని మహారాష్ట్రలో విపరీతంగా ఆరాధిస్తారు. వీరుడు అంటారు. అలాంటి వ్యక్తి మీద కోషియారీ వ్యతిరేక వ్యాఖ్యలు చేయకపోయినా ఆయన ఇదివరకెప్పుడో ఆరాధ్యుడుఅనడం దుమారంరేపింది. మహారాష్ట్రలో ప్రతిపక్షంలో ఉన్న ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ నాయకుడు అజిత్ పవార్ కోషియారీ మీద మండిపడ్డారు. శివాజీని గవర్నర్ అంత మాట అంటే అధికారంలో ఉన్న ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన ఎందుకు నోరువిప్పడం లేదని ఉద్ధవ్ ఠాక్రే వర్గం నాయకుడు, ఉద్ధవ్‌కు సన్నిహితుడు అయిన సంజయ్ రౌత్ విమర్శలు గుప్పించారు. ఒక ఏడాదికాలంలో గవర్నర్ శివాజీని నాలుగుసార్లు అవమానించారు అని రౌత్ లెక్కలుకూడా తీసి చెప్పారు. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శివాజీని అమితంగా ఆరాధిస్తారని, బీజేపీ అధికార ప్రతినిధి శివాజీ ఔరంగజేబ్‌కు అయిదుసార్లు క్షమాపణలు చెప్పారని బీజేపీ అధికార ప్రతినిధే చెప్పారని, అలాంటప్పుడు ఇదేనా బీజేపీ వైఖరిఅని రౌత్ నిలదీశారు. అయితే ప్రతిపక్ష నాయకుడు అజిత్‌పవార్ గవర్నర్ కోషియారీ ఆ పదవిలో కొనసాగాలో లేదో ఆలోచించుకోవాలని సూచించారు. బీజేపీ శివాజీని అపారంగా ఆరాధిస్తుంది. కోషియారీ గతంలో ఆ పార్టీ నాయకుడే. ప్రతిపక్షం విమర్శలు తీవ్రమైన తరవాత అధికారపక్షం కూడా రంగంలోకి దిగింది. సూర్యచంద్రులు ఉన్నంతకాలం శివాజీ ఆరాధ్యుడిగానే ఉంటారని ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవిస్ వ్యాఖ్యానించారు. పైగా శివాజీ ఒక్కడే ఆరాధ్యుడు అనే దాకా వెళ్లారు. అధికార పక్షమైన షిండేవర్గం శాసనసభ్యుడు సంజయ్ గైక్వాడ్ గవర్నరును తొలగించాలని కేంద్ర బీజేపీ నాయకులను కోరారు. శివాజీ ఆదర్శాలు ఎన్నటికీ కాలదోషం పట్టవని, ఆయనను ప్రపంచంలోని ఏ గొప్ప వ్యక్తితోనూ పోల్చడానికి వీలేలేదని గైక్వాడ్ చెప్పారు. గవర్నర్ కోషియారీకి ఈ ప్రాంత చరిత్ర తెలియదని, అలాంటి వ్యక్తిని గవర్నరుగా ఉంచకూడదని గైక్వాడ్ వాదించారు. కావాలంటే కోషియారీని మరే రాష్ట్రానికైనా పంపండి అని గైక్వాడ్ కేంద్ర బీజేపీ నాయకులను కోరారు. ప్రతిపక్షం గవర్నర్ తప్పుకోవాలంటే అధికారపక్షం శాసనసభ్యుడు గవర్నరును తొలగించాలనడం పోటీ రాజకీయాలకు పరాకాష్ఠ. నితిన్ గడ్కరి కూడా రెండురోజుల తరవాత పెదవి విప్పారు. "శివాజీ మహారాజ్ మా దేవుడు. మా తల్లిదండ్రులను ప్రేమించిన దానికన్నా ఎక్కువగా శివాజీని ఎక్కువ ఆరాధిస్తాం" అన్నారు. ఇది సమస్య సమసిపోయేలా చేయడానికి బీజేపీ చేసిన ప్రయత్నమే అనుకోవాలి.

వివాదాలు రేపడం కోషియారీకి కొత్త కాదు. 2019లో మహారాష్ట్ర గవర్నరు అయినప్పటినుంచి ఆయన ఏదో ఓ వివాదానికి కారకులవుతున్నారు. మొన్నటి దాకా బీజేపీతో సరిపడని శివసేన, కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్‌తో కూడిన ఐక్య సంఘటన అధికారంలో ఉంది కనక, తాము గవర్నర్లుగా ఉన్న రాష్ట్రాలలో ప్రత్యర్థి పక్షాల ప్రభుత్వాలను ఇరుకున పెట్టడానికి గవర్నర్లు గీత దాటి మాట్లాడుతున్నారని సరిపెట్టుకోవచ్చు. కానీ ఇప్పుడు మహారాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామి. నిజం చెప్పాలంటే ప్రభుత్వాధినేత ఏక్‌నాథ్ షిండే కావచ్చు. ఆయన నాయకుడైనా ఆధిపత్యం చెలాయిస్తున్నది బీజేపీనే. ఇలాంటి సందర్భంలో కూడా కోషియారి పదే పదే వివాదాలు రేకెత్తించడం ఆయన స్వభావం అనుకోవాలి. ఆయన కలహ ప్రియత్వ చిట్టా సుదీర్ఘమైంది. మహారాష్ట్ర నుంచి గుజరాతీలని, మార్వాడీలను తొలగిస్తే ముంబై దేశ ఆర్థిక రాజధానిగా మనలేదని కోషియారీ అనడం విమర్శలకు తావిచ్చింది. దీన్ని ఏకమొత్తంగా మహారాష్ట్రీయులను అవమానించడమే అన్నవారు ఉన్నారు. ఈ ఏడాది మార్చిలోనే జ్యోతీబా పూలే, సావిత్రిబాయి పూలే బాల్య వివాహం చేసుకున్నారనీ అప్పుడు సావిత్రిబాయి వయస్సు పదేళ్లనీ, పూలే ఆమెకన్నా పదమూడేళ్ళ పెద్ద అనడం తీవ్ర విమర్శలకు గురైంది. అంతకు ముందు ఫిబ్రవరిలో ఛత్రపతి శివాజీకి సమర్థ రామదాసు గురువు అని కోషియారీ అనడం చాలా మందిని నొప్పించింది. శివాజీని పల్లెత్తు మాట అన్నా మహారాష్ట్రీయులు సహించరు. కరోనా సమయంలో గుళ్లు, గోపురాలు తెరిపించాలని అప్పటి ఠాక్రే ప్రభుత్వం మీద కోషియారీ ఒత్తిడి తీసుకొచ్చారు. ఇది ఆయన మతతత్వ వాదనకు ప్రతీక. తాజాగా గడ్కరీని పొగిడే క్రమంలో ఆయన బీజేపీ నాయకత్వాన్నే ఇరుకున పెట్టారు. కిందటి సంవత్సరం ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వం విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లను నియమించడానికి గవర్నరుకు ఉన్న అధికారాలకు కత్తెరవేసింది. కేరళలో ఈ విషయంలో బిల్లులు ప్రవేశపెట్టడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. కోషియారీ అనుభవ శూన్యుడూ కాదు. ఆయన 2001-02లో ఉత్తరాఖండ్ రెండవ ముఖ్యమంత్రిగా ఉన్నారు. అంతకు ముందు మంత్రిగా పనిచేశారు. కొంతకాలం ఉత్తరాఖండ్ బీజేపీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఆరేళ్లు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. బీజేపీ ఉపాధ్యక్షుడిగానూ బాధ్యతలు నిర్వర్తించారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు పిటిషన్ల కమిటీ చైర్మన్‌గా సైనికులకు సంబంధించి "ఒకే ర్యాంకు, ఒకే పింఛన్"పై ఆయన నాయకత్వంలోనే నివేదిక సమర్పించింది.

హిమాలయ పర్వతశ్రేణుల్లోని రాష్ట్రాలలో రైలుమార్గాల గురించి పార్లమెంటుకు నివేదిక సమర్పించింది కూడా కోషియారీ నాయకత్వంలోనే. శివాజీ గురించి కోషియారీ వ్యక్తంచేసిన అభిప్రాయాన్ని శివాజీ వారసుడు, రాజ్యసభ సభ్యుడు ఛత్రపతి సంభాజీ రాజే కూడా దుయ్యబట్టారు. కోషియారీని గవర్నరుగా తొలగించాలని మోదీకి చేతులెత్తి విజ్ఞప్తి చేస్తున్నాను అని సంభాజీ తీవ్రంగానే స్పందించారు. తాము గవర్నర్లుగా ఉన్న రాష్ట్రానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండవలసిన గవర్నర్లు ఈ మధ్యకాలంలో విపరీత వైఖరి అనుసరిస్తున్నారు. ఇందులో కోషియారీ ఒంటరికాదు.

ఆహార సంక్షోభంలో శ్రీలంక

అరుణ్‌కుమార్ శ్రీవాత్సవ

శ్రీలంక ప్రస్తుతం తీవ్ర ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దేశంలోని సుమారు 2కోట్ల ఇరవై లక్షలమంది ప్రజలు ఆహారం కోసం అలమటిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలు, ఎన్‌జీఓ సంస్థలు హెచ్చరికలుజారీ చేశాయి. జూన్ 2022న ప్రకటించిన ఐరాస తాజా నివేదికలో శ్రీలంకలో 17లక్షల మందికి తక్షణ సహాయం అవసరమని పేర్కొంది. ఈ సంఖ్య 35 లక్షలకు పెరిగిందని అందోళన వ్యక్తం చేసింది. ఈ సంస్థలు శ్రీలంకలోని అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉన్న ప్రజల ప్రాణాలను రక్షించేందుకు తక్షణ సహాయాన్ని అందిస్తున్నాయి. ముఖ్యంగా దేశంలో ఆహారం, ఔషధాల కొరతను పరిష్కరించడంతో పాటు పదిలక్షల జనాభాకు అత్యవసర సాయంగా నగదు, ఆహారం, భోజన సదుపాయాలు కల్పించింది. మానవతాసాయం క్రింద 79 మిలియన్ డాలర్ల సహాయాన్ని ప్రకటించింది. అయితే మరింత సాయం అవసరం కావడంతో దానికి మరో 70మిలియన్‌డాలర్ల ఆర్థికసాయాన్ని తాజాగా జత చేసింది. దేశంలో గత రెండు సీజన్లలో పంటలు సరిగా పండకపోవడంతో ఆహార కొరత తీవ్రమైంది. ముఖ్యంగా గర్భిణీలు, పాఠశాల పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ 20లక్షల మందికి తక్షణ ఆహారం అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జీవనోపాధి కింద మరో 15లక్షల రైతులు, మత్స్యకారులకు రక్షణ కల్పించాలని సంకల్పించింది. ప్రాథమికంగా ఐఎమ్ఎఫ్ 4 సంవత్సరాలలో తిరిగి చెల్లించాలన్న నిబంధన కింద 2.9బిలియన్ డాలర్ల బెయిలౌట్ ప్రకటించింది. శ్రీలంకలో 300కి పైగా ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీలు ఉన్నాయి. వాటిలో టాప్ 52 సంస్థలు ఈ సంవత్సరం ప్రథమార్థంలో నెలకు 2.4 బిలియన్ డాలర్లను నష్టాన్ని నమోదుచేశాయి.

జాతీయ విమానయాన సంస్థ శ్రీలంక ఎయిర్‌లైన్స్ తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొటోంది. సంస్కరణలను ఎదుర్కోవాల్సిన ప్రభుత్వ యాజమాన్యంలోని కంపెనీల జాబితాలో ఇది అత్యంత వ్యయభరితమైన కంపెనీ. శ్రీలంక జాతీయ క్యారియర్ దాదాపు 6,000 మంది సిబ్బందిని కలిగి ఉంది. 2022లో సంపాదించిన ప్రతి డాలర్‌కి 4.50 డాలర్ల నష్టాలను చవిచూసింది. శ్రీలంక ఎయిర్‌లైన్స్ 2008 నుండి ఇంతవరకు లాభాలు పొందలేదు. లండన్ నుండి కొలంబో వెళ్లే విమానంలో అధ్యక్షుడు మహిందా రాజపక్స కుటుంబ సభ్యులకు వసతి కల్పించడానికి రిజర్వేషన్‌లతో ప్రయాణికులను దింపివేయలేదని దాని సీఈఓను తొలగించడమైనది. శ్రీలంక ఎయిర్‌లైన్స్‌లో సంస్కరణల అమలుపై ప్రభుత్వ ప్రతినిధి మానుషానయక్కర ఇటీవల మాట్లాడుతూ "శ్రీలంక విమానంలోకి అడుగుపెట్టని వారు కూడా విమానయాన సంస్థ సబ్సిడీ చెల్లిస్తున్నది. ఈ విధంగా మేము సంస్థను కొనసాగించలేమని సంస్థ తెలిపింది. సంస్థ పునర్వ్యవస్థీకరణకుగాను విదేశీ పెట్టుబడులను కోరాలని ప్రభుత్వం గత నెలలో ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరింది.

నష్టపోతున్న దేశీయ సంస్థలతో పాటు, కోవిడ్ కారణంగా రెండు సంవత్సరాల షట్‌డౌన్ శ్రీలంక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావంచూపింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడిన శ్రీలంకపై ప్రభావం చూపింది. శ్రీలంక ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం కీలకమైన ఆధారం. ఆర్థిక వ్యవస్థను పెంచుకునే ప్రయత్నంలో భాగంగా, శ్రీలంక తన పర్యాటక రంగ వృద్ధికిగాను భారత్ వైపు చూస్తోంది. ప్రస్తుత సంక్షోభంకాలంలో భారత్ శ్రీలంకకు పెద్దసహాయం చేసింది. జనవరి నుండి ఇప్పటి వరకు సుమారు 4 బిలియన్ డాలర్ల విలువైన మద్దతును ప్రకటించింది. మొత్తం పర్యాటకుల రాకపోకల్లో భారతీయ పర్యాటకులు 21శాతం ఉన్నారు.

ప్రస్తుతం శ్రీలంకకు పర్యాటకులు ఎక్కువగా వచ్చివెళుతున్నారు. భారత్ మా ప్రధాన మార్కెట్. మేము మూడు రకాల పర్యాటకులను లక్ష్యంగా చేసుకున్నాము. కుటుంబం, వినోదం, రామాయణం. భారతీయ పర్యాటకుల కోసం శ్రీలంక ప్రత్యేక ఒప్పందాలను కూడా రూపొందించింది. ఈ ఏడాది 10 నెలల్లో శ్రీలంక పర్యాటక ఆదాయం 1 బిలియన్ డాలర్లు దాటింది. అక్టోబర్‌లో సుమారు 42,000 మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు. ఈ సంవత్సరం మొత్తం పర్యాటకుల సంఖ్య 5,68,000కి చేరింది. కొలంబో పోర్ట్‌లో 700 మిలియన్ డాలర్ల విలువగల వెస్ట్ కంటైనర్ టెర్మినల్ నిర్మాణం ప్రారంభమైంది. ఈ ప్రాజెక్ట్‌లో భారత్‌కు చెందిన అదానీ గ్రూప్ 51శాతం వాటాను కలిగి ఉంది. ఇది శ్రీలంక ఓడరేవు రంగంలో మొదటి భారతీయ పెట్టుబడి కూడా. ఈ ప్రాజెక్ట్ మొదటి దశ 2023 మూడవ త్రైమాసికం నాటికి పూర్తవుతుందని అంచనా. ప్రాజెక్ట్ 2025 చివరి నాటికి పూర్తికానుంది. అదానీకి చెందిన 51శాతం వాటాతో పాటు, శ్రీలంకకు చెందిన జాన్ కీల్స్ హోల్డింగ్స్ 34శాతం, మిగిలినది శ్రీలంక పోర్టు అథారిటీ చేతిలో ఉంది.

పట్టణాలపై ప్రైవేటు భారాలు

ఎం కోటేశ్వరరావు

మన దేశంలోని పట్టణాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రానున్న పదిహేను సంవత్సరాలలో(2021-2036) 840బిలియన్ డాలర్లు (2020 ధరల ప్రకారం (రూపాయి విలువ 73 చొప్పున) లేదా రు. 61.4 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టాలని ప్రపంచబ్యాంకు అధ్యయనం సిఫార్సు చేసింది. ఇది జీడీపీలో 1.18శాతానికి సమానం. గత దశాబ్దిలో జీడీపీలో 0.6 శాతం ఖర్చుచేశారు. నవంబరు14న ఈ నివేదికతో పాటు ఒక ప్రకటనను ప్రపంచబ్యాంకు విడుదల చేసింది. వివిధ దేశాల మీద నివేదికలను రూపొందించేందుకు ప్రపంచబ్యాంకు కొందరిని ఎంపిక చేస్తుంది. దేశాలు రుణాలు, ఇతర అవసరాల కోసం వచ్చినపుడు సూచనల పేరుతో ఆయా దేశాలపై రుద్దుతుంది. ప్రభుత్వాలు వాటిని తమ విధానాలుగా ముద్రవేసి అమలు చేస్తాయి. తాజా నివేదికను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు ఏమి చేస్తాయో చూడాల్సి ఉంది. పారిశ్రామిక పెట్టుబడుల నుంచి పూర్తిగానూ, సేవా రంగాల నుంచి పాక్షికంగా గత మూడు దశాబ్దాలుగా తప్పుకుంటున్న ప్రభుత్వాలు ప్రయివేటు పెట్టుబడుల మీదే ఆధారపడి అందుకు అనువుగా విధానాలను రూపొందిస్తున్నాయి.

ఈ నివేదికను కూడా అదే విధంగా రుద్దే అవకాశం ఉంది. ప్రపంచ బ్యాంకులోని ధనిక దేశాల్లో ఉండే పెట్టుబడి సంస్థలకు మార్కెట్ అవసరం, సంస్కరణలను వేగంగా అమలు జరుపుతానని ప్రధాని మోదీ 2014 నుంచి చెప్పటం, ప్రజాభిప్రాయాన్ని ఖాతరు చేయకుండా(విశాఖ ఉక్కును అమ్మేస్తామని పదే పదే చెప్పటం) కొన్ని రంగాల్లో అమలు జరుపుతున్న పూర్వరంగంలో ఈ నివేదికను రూపొందించారు. దేశంలోని పట్టణ స్థానిక సంస్థల తీరు తెన్నుల గురించి ఈ నివేదికలో పేర్కొన్న అంశాల సారాంశం ఇలా ఉంది.

2021లో 47 కోట్లుగా ఉన్న పట్టణ జనాభా 2036 నాటికి 60 కోట్లకు, మొత్తం జనాభాలో 40శాతానికి పెరగనుంది. 840 బిలియన్ డాలర్ల అంచనాలో భాగంగా నీటి సరఫరా, వర్షపు నీరు, మురుగునీటి పారుదల, చెత్తయాజమాన్యం, రోడ్లు, వీధిదీపాలకు గాను 450 బి.డాలర్లు, రవాణా సదుపాయాలకు 300 బి.డాలర్లు అవసరమవుతాయని అంచనా. గతంలో కేంద్ర ప్రభుత్వం 2012 నుంచి 2032 వరకు మౌలిక వసతులు, సేవల కల్పనకు 560 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవసరమని అంచనా వేసింది. మెకెన్సీ నివేదిక ప్రకారం 2000-14 సంవత్సరాలలో చైనా జీడీపీలో 2.8శాతం ఖర్చు చేసింది. 2010లో తలసరి 116 డాలర్లు ఖర్చు చేసింది. చైనా మాదిరి పట్టణీకరణకు ఇతర దేశాల్లో జీడీపీలో నాలుగుశాతం ఖర్చు పెట్టాలని ప్రపంచబ్యాంకు సూచించింది. గత దశాబ్దిలో సగటున ఏటా 10.6 బిలియన్ డాలర్లు మాత్రమే భారత్‌లో పెట్టుబడులు పెట్టారు. స్థానిక సంస్థలు తమ నిధులను కేంద్ర, రాష్ట్ర

ప్రభుత్వాలు గ్రాంట్లు, స్థానిక వనరుల ద్వారా సమకూర్చుకుంటాయి. కేంద్రం ఇచ్చే కొన్ని నిధులకు రాష్ట్రం కొంత తోడు చేస్తేనే నిధులు విడుదల అవుతాయి. ఆర్థిక సంఘాల సిఫార్సుల మేరకు నిధుల బదలాయింపు పెరిగినప్పటికీ పట్టణ స్థానిక సంస్థల మొత్తం రాబడి 2011-18లో జీడీపీలో ఒక శాతం లోపుగానే ఉంది. సొంత వనరుల రాబడి నానాటికీ తగ్గుతోంది, దానికి సేవలకు వసూలు చేస్తున్న మొత్తాలు తక్కువ. సొంత వనరుల రాబడి (ఓఎస్ఆర్)లో ఇంటి పన్ను అతి పెద్ద భాగమైనా పొరుగు దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. ఈ మొత్తం జీడీపీలో 0.15శాతం కాగా మధ్య తరహా ఆదాయ దేశాల్లో 0.3 నుంచి 0.6 శాతం వరకు ఉంది. ఓయిసిడి దేశాల్లో 1.1 శాతం, అమెరికా, కెనడా, బ్రిటన్లో 2-3శాతం వరకు ఉంది. అనేక దేశాల్లో ఇతర పన్నుల కంటే ఆస్తిపన్ను వేగంగా పెరుగుతోంది. నిర్వహణ ఖర్చుల కంటే కూడా సేవా రుసుములు తక్కువగా ఉండటానికి విధాన పరమైన నిర్ణయాలే కారణం. ఇటీవలి సంవత్సరాలలో మూడింట రెండువంతులు మాత్రమే బడ్జెట్ కేటాయింపులలో మౌలిక సదుపాయాలకు ఖర్చు చేస్తున్నారు. స్మార్ట్ సిటీస్, అమృత్ పథకాల కింద ఆమోదించిన మొత్తాలలో కేవలం ఐదో వంతు మాత్రమే గడచిన ఆరు సంవత్సరాల్లో ఖర్చు చేశారు.

విధానపరమైన, రాజకీయ, ఆర్థిక విధాన నిర్ణయాలు రాబడి స్థాయిలను, ఆచరణను ప్రభావితం చేస్తున్నాయి. ప్రైవేటు పెట్టుబడులకు ఇవి ఆటంకంగా ఉన్నాయి. అవసరమైన పెట్టుబడులకు ప్రోత్సాహకాలతో పాటు తిరిగి చెల్లించేవిధంగా పన్నులు, వినియోగచార్జీలను పెంచాల్సిఉంది. కొన్ని నగరాల్లోనైనా స్వల్ప, మధ్యకాల ప్రైవేటు వాణిజ్య పెట్టుబడులకు అవకాశం కల్పించేందుకు పూనుకోవాలి. భారత్‌లో పట్టణాల మౌలిక సదుపాయాలకుఅవసరమైన పెట్టుబడుల్లో కేవలం ఐదు శాతమే ప్రైవేటు పెట్టుబడులు సమకూరుతున్నాయి. గుజరాత్‌లో కేవలం ఒకశాతమే ఉండగా తమిళనాడులో 12శాతం ఉన్నాయి. పదిహేనవ ఆర్థిక సంఘ సిఫార్సుల మేరకు 2025 నాటికి జీడీపీ 0.32శాతం షరతులు లేని మొత్తాలను పట్టణ సంస్థలకు ఇవ్వాలి. కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో మరింత స్థిరమైన, సూత్రాలతో కూడిన, షరతులులేని నిధుల బదలాయింపు పద్ధతిని పాటించాలి. ప్రస్తుతం సగంనిధులు షరతులతోకూడిన నిధుల బదలాయింపు జరుగుతోంది. పట్టణాల్లో ద్రవ్య పునాది విస్తరణ, రుణయోగ్యత పెంపుదలకు రాబడి ఆటంకాలను తొలగించాలి. ప్రస్తుతం తక్కువగా ఉన్న ఆస్తిపన్ను, వినియోగ, సేవా రుసుములను గణనీయంగా పెంచాలి. గణనీయంగా వాణిజ్య రుణాలు తీసుకొనే విధంగా స్వంత వనరులు ప్రతి ఐదు సంవత్సరాలకు రెట్టింపయ్యే విధంగా పెంపుదల ఉండాలి.

పైన పేర్కొన్న అంశాలన్నీ ప్రపంచ నివేదికలో పేర్కొన్నవే. పట్టణాలలో మౌలిక సదుపాయాల కల్పన పెట్టుబడులను వాణిజ్య సంస్థల నుంచి తీసుకోవాలి. వాటిని తీర్చేందుకు వీలుగా పట్టణ స్థానిక సంస్థలకు రాబడి వనరుల పెంపుదల, అందుకోసం ప్రజలనుంచి వసూలు చేసేందుకు అవసరమైన సంస్కరణలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలి. ఈ నివేదికను తు.చ తప్పక అమలు జరిపితే ఎన్నో రెట్ల భారం పౌరుల మీద పడుతుంది. ధనిక దేశాలను చూసి అక్కడి మాదిరి మనదేశంలో కూడా అమలు జరపాలని ప్రపంచబ్యాంకు చెప్పింది. తమ ఇండ్ల మీద హెలికాప్టర్లు దిగేందుకు అవసరమైన సౌకర్యాలను సమకూర్చుకుంటున్న వైనం ఒకవైపు ఉంటే మరో వైపు మురికివాడల్లో ఎండకూ వానకు రక్షణకు ప్లాస్టిక్ షీట్లను అమర్చుకొనే పేదరికం మనదేశంలో కనిపిస్తున్నది.

అనేక దేశాల్లో ధనికుల మీద మనకంటే ఎక్కువ పన్నులు వసూలు చేస్తున్నారు. మన దేశంలో వారికి అనేక రాయితీలు ఇస్తున్నారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో, పట్టణాల్లో ఇంటి పన్ను పెంచారు. ఎవరి చెత్తను వారు తొలగించేందుకు చెత్తపన్ను విధించారు. అదెక్కడా పన్ను రూపంలో కనిపించదు. చెత్తసేకరణకు వచ్చే వారికి ఇచ్చే మొత్తాలుగా ఉంటాయి. త్వరలో గ్రామాలకూ దీన్ని వర్తింప చేయాలని ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న కారణంగా మౌలిక సదుపాయాలపై వత్తిడి, కొరత తీవ్రమవుతోంది. ఈ నివేదికలో 2021 నుంచి అమలు జరపాలని చెప్పటాన్ని బట్టి కేంద్ర ప్రభుత్వానికి ముందే అందచేసి ఉండాలి. ఇప్పటికే రెండు సంవత్సరాలు గడిచాయి. 2024లో జరగనున్న పార్లమెంటు ఎన్నికల ముందు కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ పట్టణ జనాభా మీద విపరీత భారాలను మోపి ఓట్లడిగే సాహసానికి పూనుకోదన్నది స్పష్టం. అందువలన ఎన్నికల తరువాత వచ్చే కేంద్ర ప్రభుత్వం భారాలను జనం మీద మోపటం ఖాయం. 2020 సంవత్సర ధరల ఆధారంగా ఖర్చు అంచనా వేశారు. రూపాయి విలువ 73 నుంచి 82కు పతనం కావటం, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సవరిస్తే 840 బిలియన్ డాలర్లు లేదా రు.61లక్షల కోట్ల అంచనా ఇంకా ఎంత పెరుగుతుందో చెప్పలేము.

కీలకమైన మెయిన్‌పురి ఉపఎన్నిక

ప్రదీప్‌కుమార్

లోక్‌సభకు 2024లో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మెయిన్‌పురి లోక్‌సభ సీటును కైవసం చేసుకునేందుకు బీజేపీ సర్వశక్తులు ఒడ్డుతోంది. డిసెంబరు 5న జరిగే మెయిన్‌పురి ఉప ఎన్నికల్లో యాదవులకు కీలకంగా ఉన్న ఈ స్థానంలో పాగా వేయాలని బీజేపీ తహతహలాడుతోంది. సిట్టింగ్ ఎంపీ సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయంసింగ్ యాదవ్ మరణంతో పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కుటుంబ వారసత్వాన్ని సానుభూతి అస్త్రంతో తన భార్య డింపుల్ యాదవ్‌ను రంగంలోకి దింపారు. అయితే బీజేపీ తన వ్యూహంలో భాగంగా ములాయం సింగ్ యాదవ్ సోదరుడు శివపాల్ యాదవ్ సన్నిహితుడు రఘురాజ్ షాక్యాను రంగంలోకి దించింది. శివపాల్ యాదవ్ మద్దతుతో రఘురాజ్ షాక్యా ఇటావా నుండి రెండుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. సమాజ్‌వాదీ సభ్యుడైన శాక్యా శివపాల్ యాదవ్ నేతృత్వంలోని ప్రగతిశీల సమాజ్‌వాజ్‌వాదీపార్టీలో చేరారు. తదనంతరం 2022 అసెంబ్లీ ఎన్నికలముందు బీజేపీతీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ తరఫున నామినేషన్ దాఖలుకు ముందు శాక్యా ములాయం సింగ్ యాదవ్ సమాధిని సందర్శించి ఓటర్ల సానుభూతి పొందే ప్రయత్నం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ములాయం సింగ్ యాదవ్‌పై బిజెపి అభ్యర్థి ప్రేమ్ సింగ్ శాక్యా ఓట్లను సాధించినప్పటికీ 90,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ ప్రాంతంలో శాక్య సామాజికవర్గం ప్రభావాన్ని తెలుసుకున్న అఖిలేష్ యాదవ్, డింపుల్ యాదవ్ నామినేషన్ దాఖలుకు కొన్ని రోజుల ముందు మాజీ ఎమ్మెల్యే అలోక్ షాక్యాను జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. మెయిన్‌పురి ఎన్నికల్లో డింపుల్ యాదవ్ తరపు ప్రచారంలో శివపాల్‌యాదవ్‌ను



స్టార్ క్యాంపెయినర్‌గా అఖిలేష్ ప్రకటించారు. అయితే ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ సంఘ్ పరివార్‌కు చెందిన సంస్థల నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సమీకరించింది.

మెయిన్‌పురి నియోజకవర్గంలో 17 లక్షలమంది ఓటర్లలో ప్రధానంగా నాలుగు లక్షలమంది యాదవులు కాగా, 80,000మంది ముస్లింలు, రెండు లక్షలమంది శాక్యులు ఉన్నారు. బీఎస్పీ ఎన్నికల్లో పోటీచేయని పక్షంలో ఈ నియోజకవర్గంలో 1.5లక్షల దళితుల ఓట్లు ఏ పార్టీకి పడతాయో అంచనావేయడం చాలా కష్టంగా ఉంది. కీలకమైన ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ కూడా ఏ అభ్యర్థిని నిలబెట్టలేదు, అయితే సాంప్రదాయ ఓటర్లు సమాజ్‌వాదీ పార్టీకి మద్దతుఇచ్చే అవకాశంఉంది. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి డింపుల్‌యాదవ్‌కు మద్దతుగా బీజేపీని ఓడించాలని నిర్ణయించుకున్న అన్ని పార్టీలతో అఖిలేష్ యాదవ్ టచ్‌లో ఉన్నారు. మరోవైపు, కాషాయ పార్టీ హిందుత్వ భావజాలానికి సాంప్రదాయకంగా మద్దతిచ్చే ఓటర్లను ఆకర్షించ దానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రచారం చేసుకుంటోంది. మెయిన్‌పురి ఉపఎన్నికల ఫలితం ఏదైనా కావచ్చు, అయితే అది ఖచ్చితంగా అఖిలేష్ యాదవ్ నాయకత్వంలో 2024 లోక్‌సభ ఎన్నికల కోసం బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీలను ప్రభావితం చేస్తుందనేది సుస్పష్టం.

మత్స్యకారులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి

ప్రపంచ వ్యాప్తంగా 3.5 ట్రిలియన్ల మత్స్య సంపద ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా "నీలి విప్లవం" ద్వారా మత్స్య సంపద పెంచడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎన్నో కోట్ల మందికి సహజ ఆహారం చేపలు. అనేక మంది మత్స్యకారులు తమ జీవితాలను పణంగా పెట్టి నదులు,సముద్ర జలాల్లో పడవులు, బోట్లు ద్వారా వేటాడి, ఒడ్డుకి తెచ్చి మానవులకు ఆహారంగా అందిస్తున్నారు. మత్స్యకార మహిళలు కూడా ఈ రంగంలో ఎక్కువగా పనిచేస్తూ, కుటుంబాల ఆర్థిక అవసరాలు తీర్చడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. వేటాడి ఒడ్డుకు తెచ్చిన రకరకాల చేపలను, రొయ్యలు, పీతలు వంటి సుమారు 50 రకాల మత్స్య సంపదను వేరుచేసి, శుభ్రంచేసి సమీప మార్కెట్‌లో విక్రయిస్తారు. కొన్ని చేపలను రొయ్యలను ఎండు చేపలు (డ్రై ఫిష్)గా, కొన్నింటిని పచ్చళ్లు, రెడి టు ఈట్/ రెడి టు సర్వ్ పద్ధతిలో అందుబాటులో ఉంచుతున్నారు. దీనితో 9.9 కేజీలుగా ఉన్న తలసరి వినియోగం 19.2 కేజీల వరకూ పెరిగింది. నేటి ఆధునిక కాలంలో కూడా చేపల మార్కెట్లు చాలా ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణంలో, మురుగు కాల్వల వద్ద అమ్మడంతో చాలామంది కొనుగోలుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వాలు పరిశుభ్రమైన చేపల మార్కెట్లు ఏర్పాటుచేసి, మత్స్యకారులను, వినియోగదారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోనే చైనా మత్స్య సంపదలో 76.15 బిలియన్ల కిలోగ్రాముల ఉత్పత్తితో మొదటి స్థానంలో ఉంది. ప్రపంచ మత్స్య ఉత్పత్తిలో 30శాతం, ఆక్వాకల్చర్‌లో 60శాతం వాటాతో నెంబర్ వన్ స్థానానికి ఎదిగింది. మన దేశంలో సుమారు 7,517 కి.మీ సముద్ర తీరం ప్రాంతం, 195,210 కి.మీ నదీ పరివాహక ప్రాంతంతో 9.60 బిలియన్ల కిలోగ్రాముల చేపల ఉత్పత్తిలో ప్రపంచంలో రెండవ స్థానంలో నిలిచింది. తరువాత స్థానంలో వియత్నాం, ఇండోనేషియా,



అమెరికా దేశాలు నిలిచాయి. మనదేశంలో మత్స్య ఉత్పత్తి రెండు రకాలుగా "ఇన్ లాండ్ విధానం, మెరైన్ పద్ధతిలో" లభిస్తుంది. 2018-19లో 137 కోట్ల టన్నుల ఉత్పత్తితో ద్వితీయ స్థానంలో నిలిచింది. జనాభా పెరుగుదల, ఆధునీకరణ, పట్టణీకరణ, నూతన సౌకర్యాలు, నవీన వంటల విధానాలు, రవాణా సౌకర్యాలు, శీతలీకరణ యూనిట్లు తదితర కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా మత్స్య సంపద వాడకం పెరిగింది. విహారయాత్రలు, రెస్టారెంట్లు సంస్కృతి, పార్టీలు, దూర ప్రాంతాలకు కూడా ఫ్రెష్‌గా తీసుకు వెళ్ళగలిగే సౌకర్యాలు రావడంతో చేపలు, రొయ్యలు, పీతలు వంటి మత్స్య సంపద వాడకంతో గిరాకీ పెరిగింది. దీనితో కుటుంబ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం, దేశ జీడీపీ వృద్ధికి మత్స్య సంపద తోడ్పడుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా మత్స్యకార దినోత్సవం జరపాలని మనదేశంలో నిర్ణయించి, మత్స్యకారుల జీవితాల అభివృద్ధికి, వారి సమస్యల పరిష్కారానికి, సముద్రాలలో ఆల్గే,గ్యాస్,పెట్రోల్, ప్లాస్టిక్ వ్యర్థాలు కాలుష్య నివారణకుగాను 2005, నవంబర్ 21వ తేదీన ప్రపంచ మత్స్యకార దినోత్సవం మొదటిసారిగా ఐ.సి.ఏ.ఆర్, కేంద్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిపారు. మత్స్య సంపద వినియోగంతో 25శాతం ప్రోటీన్‌తో ఆరోగ్యానికి మేలు చేస్తాయని అవగాహన కల్పించాలి. వేటకు వెళ్లిన సమయంలో తుఫాన్లు, వాయుగుండాలు ఏర్పడిన సందర్భంలో సురక్షిత ప్రాంతాలకు ఎలాచేరాలి, వాతావరణ మార్పులు, హెచ్చరికలు, సూచనలు తెలుసుకునే విధానాలపై మత్స్యకారులకు అవగాహన కోసం సమావేశాలు, సదస్సులు నిర్వహించాలి. ముఖ్యంగా ఆసియా, ఆఫ్రికా ఖండంలో కొన్ని లక్షల మంది ఈ రంగంలో ఉపాధి పొందుతున్నారు. సంవత్సరంలో కొన్ని నెలలు (బ్రీడింగ్) సమయాన వేట నిషిద్ధం. ఆ సమయంలో వారిని ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యకారులకు 10,000/- రూపాయలు సహాయం అందిస్తుంది. డీజిల్‌పై సబ్సిడీని ఇస్తున్నారు. ప్రమాదాలు జరిగి మత్స్యకారుల మరణిస్తే 10 లక్షల రూపాయలు అందిస్తూ భరోసా కల్పిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం మత్స్యకారులకు "ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన" పథకం అమలుచేస్తూ మత్స్యకారుల వెంట వెన్నుదన్నుగా ప్రభుత్వాలు నిలబడాలి. వారి పిల్లల చదువులకు సముద్రతీర ప్రాంతాల్లో, వారి ఆవాసాలకు దగ్గరగా తుఫాన్ షెల్టర్లు అవసరం మేరకు నిర్మించాలి. వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. తమిళనాడు, ఒడిసా, బిహార్‌లో పెంచుతున్న చేపలు, రొయ్యల్లో కాడ్మియం, సీసం వంటి ప్రమాదకరమైనవి ఉంటున్నాయి అని నివేదికలు చెబుతున్నాయి. ఆక్వాకల్చర్ పెంచుతున్న ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. పరిసరాల్లో కాలుష్యం పెరుగడంపై వివిధప్రాంతాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఇప్పటికే మనదేశం సుమారు 90దేశాలకు మత్స్యసంపద ఎగుమతి చేస్తూ, ఉత్పత్తిలో ద్వితీయ స్థానంలో ఉంది.

ఐ.పి.రావు, 9948272919

చావ్లా అత్యాచారం-హత్య కేసు

న్యాయం కోసం తుది వరకు పోరాడుతా

- బాధితురాలి తండ్రి
- సుప్రీంలో రివ్యూ పిటిషన్‌కు ఎల్‌జీ అనుమతి

న్యూఢిల్లీ: 2012లో చావ్లాపై అత్యాచారం-హత్య కేసులో నిందితులను నిర్దోషులుగా విడుదల చేయడం పై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలయింది. దీనిని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమోదించారు. ఈ కేసులో మరణశిక్ష పడిన ముగ్గురు వ్యక్తులను ఇటీవల సుప్రీం కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా రివ్యూ పిటిషన్‌కు అనుమతి ఇవ్వడాన్ని బాధితురాలి తండ్రి సోమవారం స్వాగతించారు. వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ నవంబర్ 7న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో తమ కుటుంబం ఇంకా తేరుకోలేదని ఆయన అన్నారు. 'వారు కాకపోతే, నా కుమార్తెపై క్రూరంగా ప్రవర్తించి ఆమెను హత్య చేసింది ఎవరు? మాకు న్యాయం చేయడం దేశంలోని పోలీసు, న్యాయ వ్యవస్థ కర్తవ్యం కాదా?' అని రివ్యూ పిటిషన్ దాఖలు చేసేందుకు ఎల్జీ అనుమతి ఇచ్చిన తర్వాత బాధితురాలి తండ్రి పీటీఐకి చెప్పారు. 'న్యాయం కోసం నా చివరి శ్వాస వరకు పోరాడతాను' అని అన్నారు. ఢిల్లీలోని ద్వారకలోని చావ్లాలో ఫిబ్రవరి 9, 2012న 19 ఏళ్ల యువతిపై జరిగిన దారుణమైన అత్యాచారం, హత్యకు సంబంధించి ఢిల్లీ హైకోర్టు ముగ్గురు నిందితులకు మరణశిక్ష విధించింది. అయితే నిందితులు ఈ శిక్షపై సుప్రీం కోర్టులో అప్పీల్ చేశారు. నిందితులకు వ్యతిరేకంగా స్పష్టమైన సాక్ష్యాలను అందించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని అత్యున్నత న్యాయ స్థానం పేర్కొంటూ, నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. కాగా సుప్రీం కోర్టులో ఈ కేసును వాదించేందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు ఎస్‌జీ ఐశ్వర్య భాటి నియామకాన్ని ఎల్జీ సక్సేనా ఆమోదించారు. ఈ కేసులో ఢిల్లీ ప్రభుత్వం తరపున వాదించేందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నియామకానికి ఎల్జీ ఆమోదం తెలిపారు. 'నేను ఇప్పుడు సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీ) పైనే నా ఆశలన్నీ పెట్టుకున్నాను. అతను సుప్రీం కోర్టును ఒప్పించి, ముగ్గురు రేపిస్టులు, హంతకులందరినీ ఉరితీసేలా చేస్తారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను' అని బాధితురాలి తండ్రి తెలిపాడు. ఫిబ్రవరి 2012లో 19 ఏళ్ల మహిళను అపహరించి, అత్యాచారం చేసి, చంపినట్లు ముగ్గురు వ్యక్తులపై ఆరోపణలు వచ్చాయి. కిడ్నాప్ అయిన మూడు రోజుల తర్వాత ఆమె ఛిద్రమైన శరీరం దొరికింది. బాధిత కుటుంబం ఉత్తరాఖండ్‌లోని పౌరీ గర్వాల్ జిల్లాకు చెందినది. బాధిత మహిళ గురుగ్రామ్ సైబర్ సిటీలో పని చేసింది. ఆమె తన పని ప్రదేశం నుంచి తిరిగి వస్తుండగా, తన ఇంటికి సమీపంలో ఉన్న సమయంలో ముగ్గురు వ్యక్తులు ఆమెను కారులో అపహరించారు. ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తె అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే హరియాణాలోని రేవారిలోని ఒక గ్రామంలో మహిళ కుళ్లిన మృతదేహాన్ని కనుగొన్నారు. మహిళ శరీరం పై అనేక గాయాలను పోలీసులు గుర్తించారు. తదుపరి విచారణ, శవ పరీక్షలో ఆమెపై కారు పనిముట్లు, గాజు సీసాలు, మెటల్ వస్తువులు, ఇతర ఆయుధాలతో దాడి చేసినట్లు వెల్లడయింది. ఆమెపై అత్యాచారం కూడా జరిగిందని వారు తెలిపారు. నేరంలో పాల్గొన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. బాధిత తల్లిదండ్రుల ఆందోళనకు మద్దతునిస్తూ, పీపుల్ ఎగైనెస్ట్ రేప్ ఇన్ ఇండియా (పీఏఆర్ఐ) అనే స్వచ్ఛంద సంస్థ నవంబర్ 20న ఢిల్లీ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించి, ఈ కేసులో న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఇదిలాఉండగా, ఇటీవల రోహిణి జైలు నుంచి ముగ్గురు ఖైదీలలో ఇద్దరిని విడుదల చేయడం, సుప్రీం నిర్దోషులుగా ప్రకటించడంతో హత్యకు గురైన బాలిక తల్లిదండ్రులు భయంతో పోలీసు రక్షణను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ మహిళా కమిషన్... ఢిల్లీ పోలీసులకు ఒక నోటీసు జారీ చేసింది. ఇందులో, ఈ విషయం చాలా సున్నితమైనదని, నేరస్థులు ఇప్పుడు స్వేచ్ఛగా బయటికి వచ్చినందున, మరణించిన మహిళ కుటుంబ సభ్యులకు ఉన్నత స్థాయి భద్రత కల్పించాలని పేర్కొంది.

ఒంటరిగా సైకిల్ తొక్కుతూ రికార్డ్ సృష్టించిన మహిళ

గువహతి: సుమారు 14 రోజుల్లో గుజరాత్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్ వరకు దాదాపు 4000 కిలోమీటర్ల దూరం సైకిల్ తొక్కి ఓ మహిళ రికార్డు సృష్టించింది. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని ఈ 45 ఏళ్ల ఇద్దరు పిల్లల తల్లి నిరూపించింది. పూణెకు చెందిన ప్రీతి మాస్కే నవంబర్ 1న పాకిస్తాన్‌తో పశ్చిమ సరిహద్దులోని కోటేశ్వరాలయం నుంచి తన రైడ్‌ను ప్రారంభించి, గుజరాత్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, అసోం, అరుణాచల్‌ప్రదేశ్ మీదుగా సైకిల్‌పై ప్రయాణించినట్లు యాత్ర చీఫ్ క్రూ ఘనశ్యామ్ రఘువంశీ సోమవారం తెలిపారు. నవంబర్ 14 అర్ధరాత్రి అరుణాచల్ ప్రదేశ్‌లోని చైనా సరిహద్దుకు సమీపంలో ఉన్న కిబితుకు చేరుకోవడానికి మాస్కే తన 3995 కిలోమీటర్ల రైడ్‌ను 13 రోజుల 19 గంటల 12 నిమిషాల్లో పూర్తి చేసిందని ఆయన చెప్పారు. ఆమె దీన్ని సాధించడంతో కేవలం 14 రోజుల్లో పశ్చిమం నుంచి తూర్పు వరకు దేశవ్యాప్తంగా ప్రయాణించిన మొదటి మహిళా సైక్లిస్ట్‌గా నిలిచింది. అనారోగ్యం, నిరాశను ఎదుర్కోనేందుకు మాస్కే ఐదేళ్ల క్రితం సైక్లింగ్ చేపట్టారు. వాహనంలో ఐదుగురు సభ్యులతో కూడిన సిబ్బంది మాస్కేను అనుసరించారు. ఆమె మార్గంలో చాలా సవాళ్లను ఎదుర్కొంది, ముఖ్యంగా అసోం, అరుణాచల్‌ప్రదేశ్‌లలో మొత్తం 15,679 మీటర్ల ఎత్తుతో ఆమె వెళ్లాల్సి వచ్చింది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ అవసరమైన లాజిస్టిక్, నావిగేషనల్ మద్దతును అందించింది, ఇది యాత్రను పూర్తి చేయడంలో ఆమెకు సహాయపడింది. మాస్కే సగటున 19 గంటల సైక్లింగ్ సమయంతో మొదటి పది రోజుల్లో దాదాపు 350 కిలోమీటర్లు సైకిల్ తొక్కారు.

అధికారం కోసమే యాత్ర

రాహుల్ 'భారత్ జోడో యాత్ర'పై ప్రధాని మోదీ ధ్వజం

సురేంద్రనగర్ (గుజరాత్): అధికారం నుంచి తరిమికొట్టిన వారు మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పాదయాత్రలు చేస్తున్నారని అంటూ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర పై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం మండిపడ్డారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల సందర్భంగా గుజరాత్ లోని సురేంద్రనగర్ పట్టణంలో జరిగిన సభలో మోదీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అభివృద్ధి గురించి మాట్లాడే బదులు ప్రతిపక్ష కాంగ్రెస్ అతని 'ఔకత్' (హోదా)ను చూపుతానని చెబుతోందని అన్నారు. 'ఇప్పుడు కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అభివృద్ధి గురించి మాట్లాడదు. బదులుగా, కాంగ్రెస్ నాయకులు మోదీకి అతని హోదాను చూపిస్తామని అంటున్నారు. వారి అహంకారం చూడండి. వారు నిజంగా ఒక రాజ కుటుంబానికి చెందినవారు. నేను కేవలం హోదా లేని సేవకుడినే' అని అన్నారు. 'గతంలో కాంగ్రెస్ నా కోసం 'నీచ్ ఆద్మీ', 'మౌత్ కా సౌదాగం', 'నాలీ కా కీడా' వంటి పదాలను ఉపయో గించింది. ఈ 'ఔకత్' ఆట ఆడకుండా అభివృద్ధి గురించి మాట్లాడాలని నేను మిమ్మల్ని కోరుతు న్నాను' అని ప్రధాని అన్నారు. భారతదేశాన్ని అభి వృద్ధి చెందిన దేశంగా మార్చడమే తన దృష్టి అయినందున తాను ఇలాంటి అవమానాలను మింగేస్తున్నానని అన్నారు. 182 మంది సభ్యులున్న గుజరాత్ అసెంబ్లీకి డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. చాలా కాలం క్రితం గద్దె నుంచి తొలగించబడిన వారు తిరిగి అధికారం కోసం యాత్రలు చేస్తున్నారని మోదీ ఎద్దేవా చేశారు. 'మళ్లీ అధికారంలోకి రావాలని కొందరు పాదయాత్రలు చేస్తున్నారు. 40 ఏళ్లుగా నర్మదా ప్రాజెక్టు కోసం న్యాయ పోరాటం చేసి, 40 ఏళ్లుగా గుజరాత్ దాహం తీర్చుకున్న వారిని కూడా వెంట తీసుకెళ్తున్నారు. ఈ ఎన్నికల్లో గుజరాత్ ప్రజలు శిక్షిస్తారని అన్నారు. ఈ పాదయాత్ర చేస్తున్నారు.. నర్మదా ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారిని కూడా ప్రజలు శిక్షిస్తారని ఆయన పేరు చెప్పకుండానే అన్నారు. ఇటీవల మహారాష్ట్రలో రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్రలో నర్మదా బచావో ఆందోళన్ అధినేత మేధా పాట్కర్ పాల్గొనడాన్ని మోదీ ప్రస్తావించారు. ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడేవారని అన్నారు. 'మళ్లీ అధికారం లోకి రావాలని కొందరు పాదయాత్రలు చేస్తున్నారు. న్యాయపోరాటం ద్వారా 40 ఏళ్లుగా నర్మదా ప్రాజెక్టును నిలిపివేసిన వారిని కూడా వెంట తీసుకెళ్తున్నారు. గుజరాత్‌ను 40 ఏళ్లుగా దాహంతో ఉంది. ఈ పాదయాత్ర చేస్తున్న వారిని ఈ ఎన్నికల్లో గుజరాత్ ప్రజలు శాసిస్తారు. నర్మదా ప్రాజెక్టును వ్యతిరేకించిన వారిని ప్రజలు కూడా శిక్షిస్తారు' అని ఆయన తెలిపారు. పాదయాత్ర చేస్తున్న నేతలకు వేరుశెనగ, పత్తి పంటల మధ్య తేడా తెలియదని రాహుల్ గాంధీపై మరో ఛలోక్తి విసిరారు. గుజరాత్‌లో తయారయ్యే ఉప్పును తిన్న తర్వాత కూడా కొందరు గుజరాత్‌ను దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. దేశంలోని ఉప్పులో 80 శాతం గుజరాత్‌లో ఉత్పత్తి అవుతున్నప్పటికీ, గత కాంగ్రెస్ ప్రభుత్వాలు 'అగరియా'లుగా పిలువబడే ఉప్పు పాన్ కార్మికుల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదని ప్రధాని మోదీ అన్నారు. సురేంద్రనగర్ జిల్లా ప్రజలు 2017లో కాంగ్రెస్‌కు కొన్ని సీట్లు ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు మేలు చేసిందేమీ లేదని ఆయన అన్నారు.

కార్యకర్తలతో ఖడ్గే భేటీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖడ్గే గత నెలలో బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా సోమవారం పార్టీ కార్యకర్తలు, ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పార్టీ కార్యకర్తలు ఉదయం నుంచి ఇక్కడి ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వెలుపల క్యూ కట్టగా, పార్టీ కొత్త అధ్యక్షుడితో ఒక్కొక్కరుగా ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. అక్టోబరు 26న పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ సమక్షంలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఖడ్గే బాధ్యతలు స్వీకరించారు. శశి థరూర్‌పై ప్రత్యక్ష పోటీలో విజయం సాధించి నవంబర్ 19న కొత్త కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రతి కార్యకర్త, నాయకుడు తనకు సమానమేనని, సంస్థను బలోపేతం చేసేందుకు అందరినీ చేరదీస్తానని పార్టీ కురువృద్ధుడు ఎన్నికయిన వెంటనే ప్రకటించారు. 24 ఏళ్లలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి గాంధీయేతర వ్యక్తి ఖడ్గే. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ గతంలో పార్టీకి సారథ్యం వహించారు.

26 నుంచి గుజరాత్‌లో ప్రచారం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ఈ నెల 26 నుంచి 28 వరకు గుజరాత్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. నవంబర్ 26న అహ్మదాబాద్‌లో జరిగే బహిరంగ సభలో ఖడ్గే ప్రసంగిస్తారని, మరుసటి రోజు విలేకరుల సమావేశంలో ప్రసంగించే అవకాశం ఉందని వారు తెలిపారు. నవంబర్ 27న రాహుల్ గాంధీతో కలిసి భారత్ జోడో యాత్రలో పాల్గొన్న అనంతరం ఇండోర్‌లో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ యాత్ర నవంబర్ 23న మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. నవంబర్ 28న గాంధీనగర్ దగ్గర జరిగే మరో బహిరంగ సభలో ఖడ్గే ప్రసంగించనున్నారు. కాగా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నికల సమావేశాలకు సంబంధించిన ఇతర వివరాలు రూపొందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇటీవల సోనియా గాంధీ నుంచి బాధ్యతలు స్వీకరించిన కొత్త కాంగ్రెస్ అధ్యక్షుడు నవంబర్ 12న అసెంబ్లీ ఎన్నికలు జరిగిన హిమాచల్ ప్రదేశ్‌లో బహిరంగ సభలను ఉద్దేశించి ప్రసంగించారు.

ప్లాట్‌ఫామ్‌పైకి దూసుకొచ్చిన గూడ్సు రైలు

10 వ్యాగన్‌లు బోల్తా: ముగ్గురు మహిళల దుర్మరణం

భువనేశ్వర్: ఒడిశాలోని జాజ్‌పూర్ జిల్లా కొరాయి రైల్వే స్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున గూడ్సు రైలు పట్టాలు తప్పింది. దీంతో బోగీలు ప్లాట్‌ఫామ్‌పై బోల్తాపడ్డాయి. ప్లాట్‌ఫామ్‌పై వేచివున్న ప్రయాణికులపై బోగీలు పడటంతో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మరణించారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. బోగీల కింద మరికొంత మంది చిక్కుకుపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం ఉదయం 6.44 గంటలకు కొరాయి స్టేషన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పింది. మొత్తం 54 బోగీల్లో 10 బోగీలు బోల్తాపడి.. స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లాయి. దీంతో భువనేశ్వర్ వెళ్లే రైలుకోసం ప్లాట్‌ఫామ్‌పై వేచిఉన్న ప్రయాణికులపైకి బోగీలు దూసుకెళ్లడంతో ముగ్గురు మరణించారని, రెండున్నరేళ్ల చిన్నారితో సహా ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రయాణికులు నిరీక్షించే గది సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో రైలు బోగీల కింద మరికొంతమంది ఉండొచ్చని భావిస్తున్నారు. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంతో రైల్వేస్టేషన్‌లో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి కొంతభాగం కూలిపోయింది.

గుజరాత్‌లో 'వారసుల' హోరు

20 సీట్లలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ



అహ్మదాబాద్: ఇది ఖండించదగిన విషయమే... అలాగే ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే. కానీ త్వరలో జరగనున్న గుజరాత్ శాసనసభ ఎన్నికల బరిలో మాత్రం 'వారసత్వ' రాజకీయం రాజ్యమేలుతోంది. ఈ ఎన్నికలలో అభ్యర్థుల జాబితా 'వంశ రాజకీయాల' నుంచి విముక్తి పొందలేదు. కనీసం 20 మంది అభ్యర్థులు సిట్టింగ్, మాజీ ఎమ్మెల్యేల కుమారులు. అధికార బీజేపీ ఏడుగురు అభ్యర్థులను నిలబెట్టగా, కాంగ్రెస్ 13 మందిని నిలబెట్టిందని పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. గుజరాత్‌లో డిసెంబర్ 1, 5 తేదీల్లో పోలింగ్ జరగనుండగా... డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. రాష్ట్రంలోని ఛోటా ఉదేపూర్ నియోజకవర్గం నుంచి మాతృ పార్టీతో తన బంధాన్ని తెంచుకున్న పదిసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే అయిన మోహన్‌సింగ్ రథ్వాకు బీజేపీ బహుమతి ఇచ్చింది. ఛోటా ఉదేపూర్ స్థానం నుంచి ఆయన కుమారుడు రాజేంద్రసింగ్ రథ్వాను పోటీకి దింపింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఛోటా ఉదేపూర్ స్థానం నుంచి రైల్వే శాఖ మాజీ మంత్రి నరన్ రథ్వా కుమారుడు సంగ్రామ్‌సింగ్ రథ్వాను పోటీకి దింపింది. ఈ ఇద్దరు అభ్యర్థులు తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. నియోజకవర్గం షెడ్యూల్డ్ తెగ (ఎస్‌టీ) అభ్యర్థులకు రిజర్వు అయింది. ఇక అహ్మదాబాద్ జిల్లాలోని సనంద్ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన కను పటేల్... కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే కరణ్‌సింగ్ పటేల్ కుమారుడు. 2017లో కరణ్‌సింగ్ పటేల్ బీజేపీలో చేరారు. పటేల్ జూనియర్ సనంద్ నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేసేందుకు మార్గం సుగమం చేశారు. కాషాయ పార్టీ ఈసారి ఆయనకు మరోసారి టికెట్ ఇచ్చింది. అలాగే థస్రా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి యోగేంద్ర పర్మార్... రెండుసార్లు ఎమ్మెల్యే అయిన రామ్‌సింగ్ పర్మార్ కుమారుడు. 2007, 2012లో సీనియర్ పర్మార్ కాంగ్రెస్ టికెట్‌పై గెలిచారు. 2017లో ఆయన పార్టీని వీడారు. కానీ బీజేపీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. దానిలిమ్డా నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయిన మాజీ ఎమ్మెల్యే మనుభాయ్ పర్మార్ కుమారుడు శైలేష్ పర్మార్‌ను కాంగ్రెస్ పార్టీ మరోసారి రంగంలోకి దించింది. బయాద్ నియోజకవర్గం నుంచి మహేంద్రసింగ్ వాఘేలా పోటీ చేస్తున్నాడు. ఈయన రెండుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి శంకర్‌సింగ్ వాఘేలా కుమారుడు. 2012-2017 మధ్య 2019లో బీజేపీకి మారడానికి ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించాడు. అతను గత నెలలో తిరిగి కాంగ్రెస్‌లో చేరి బయాద్ స్థానం నుంచి బరిలోకి దిగాడు. బార్డోలి స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన తుషార్ చౌదరి... మాజీ ముఖ్యమంత్రి అమర్‌సింగ్ చౌదరి కుమారుడు. బార్డోలి ఎస్టీ అభ్యర్థులకు రిజర్వ్ చేయబడింది. చౌదరి 2004-09 మధ్య మాండ్వీ ఎంపీగా, 2009 నుంచి 2014 వరకు బార్డోలి ఎంపీగా పని చేశారు. జెట్‌పూర్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి జయేష్ రదాడియా, పోర్‌బందర్ సీటు నుంచి బీజేపీ మాజీ ఎంపీ (దివంగత) విఠల్ రదాడియా కుమారుడు. 2012లో జెట్‌పూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. జయేష్, అతని తండ్రి 2013లో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. 2017లో జెట్‌పూర్ నుంచి బీజేపీ టికెట్‌పై గెలుపొందారు. విజయ్ రూపానీ మంత్రివర్గంలో కూడా పని చేశారు.

బీజేపీ ఎమ్మెల్యేకు దేహశుద్ధి

చిక్‌మంగళూర్: కర్నాటకలోని చిక్‌మంగళూర్ జిల్లా హల్లెమనే గ్రామంలో బీజేపీ ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు దేహశుద్ధిచేశారు. ఏనుగుల దాడులను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి ప్రజలు అడిగితే సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన స్థానికులు ఎమ్మెల్యేపై చేయిచేసుకున్నారు. ఆయన దుస్తులను చింపేశారు. ఎమ్మెల్యేను కారులో ఎక్కించి భద్రతా సిబ్బంది క్షేమంగా తరలించారు. కుందూరుకు చెందిన శోభ ఇటీవల గడ్డి కోసేందుకు వెళ్లగా.. ఏనుగు దాడి చేయడంతో చనిపోయారు. దీనిపై గ్రామస్థులు ఆందోళనకు దిగారు. ఆమె కుటుంబీకులను పరామర్శించేందుకు ముదిగెరె ఎమ్మెల్యే కుమారస్వామి వచ్చారు. బాధిత మహిళ ఇంటి వద్ద గుమిగూడిన గ్రామస్థులు ఆయనను ఇంటిలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఏనుగుల దాడులను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. దాంతో బిత్తరపోయిన ఎమ్మెల్యే సమాధానం చెప్పకుండా మిన్నకుండిపోయారు. మరింత ఆగ్రహించిన ప్రజలు ఆయన చొక్కా చించి కొట్టారు. కారును కూడా ధ్వంసం చేశారు. సెక్యూరిటీ గార్డులు కల్పించుకుని ఆయనను కారులో క్షేమంగా పక్కకు తీసుకెళ్లారు. తనపై గ్రామస్థులు పథకం ప్రకారం దాడి చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని ఎమ్మెల్యే చెప్పారు. ఏనుగుల దాడిని అరికట్టేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పేలోపుగా ఒక వర్గం వారు తనపై దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఈసీగా అరుణ్ గోయల్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: భారత ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమిషనర్‌గా రెండు రోజుల క్రితం ఆయనను నియమించిన విషయం తెలిసిందే. ఎన్నికల కమిషన్‌లో ముగ్గురు కమిషనర్లు ఉంటారు. ఈ ఏడాది మే నెలలో సుశీల్ చంద్ర పదవీవిరమణ చేయడంతో ఒక కమిషనర్ పదవి ఖాళీగా ఉంది. ఆ ఖాళీని ఇప్పుడు భర్తీచేశారు. 1985వ బ్యాచ్‌కు చెందిన అరుణ్ గోయల్ పంజాబ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి. డిసెంబర్ 31వ తేదీన ఆయన రిటైర్ కావాల్సి ఉంది. కానీ నవంబర్ 18వ తేదీనే ఆయన స్వచ్ఛంద విరమణ చేశారు. 2025 ఫిబ్రవరిలో రాజీవ్ కుమార్ పదవీకాలం ముగిసిన తర్వాత సీఈసీగా గోయల్ బాధ్యతలు స్వీకరించే అవకాశాలు ఉన్నాయి.

కరోనా రోగి మృతికి కారణమైన డాక్టర్లపై ఎఫ్ఐఆర్

నోయిడా: కరోనా రెండోదశలో విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటూ, కరోనా రోగి మరణానికి కారణమైన నోయిడాలోని ఓ ఆస్పత్రికి చెందిన ఐదుగురు వైద్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు అధికారులు సోమవారం తెలిపారు. 20 ఏళ్ల రోగికి వైద్యుల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా రెమిడెసివీర్ ఇంజెక్షన్ కొనుగోలు చేసినప్పటికీ ఆస్పత్రిలో అతనికి సకాలంలో ఇవ్వలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గౌతమ్ బుద్ధనగర్ డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇకామ్ సింగ్ ఫిర్యాదుపై ఫేజ్-2 పోలీస్‌స్టేషన్‌లో యథార్థ్ ఆస్పత్రి వైద్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే, యథార్థ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కపిల్ త్యాగి ఆరోపణలు తప్పుగా ఉన్నాయని పేర్కొన్నారు. 'రోగి పరిస్థితి విషమంగా ఉన్నందున మా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అరగంట కూడా ఆలస్యం చేసి ఉంటే, రోగి బతికేవాడు కాదని నేను నమ్ముతున్నాను. కానీ ఇక్కడ అతని పరిస్థితి మెరుగుపడటం ప్రారంభమైంది. సుమారు 35 రోజుల తర్వాత, కుటుంబం అతడిని ఢిల్లీలోని మరొక ఆసుపత్రికి తీసుకువెళ్లింది' అని త్యాగి చెప్పారు.

రాజీవ్ హంతకుల విడుదలపై కాంగ్రెస్ రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసు దోషులు ఆరుగురికి విముక్తి కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ వారంలోనే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని కాంగ్రెస్ వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాజీవ్ హంతకులను విడుదల చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఈ వారంలోనే రివ్యూ పిటిషన్ దాఖలు చేస్తామని పార్టీ కీలకనేత ఒకరు స్పష్టంచేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ నుంచి విమర్శలు తలెత్తడంతో రాజీవ్ హంతకుల విడుదలపై సమీక్ష జరపాలని మోదీ సర్కారు ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రాజీవ్‌గాంధీ హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న నళినీ శ్రీహరన్, ఆర్‌పీ రవిచంద్రన్ సహా ఆరుగురిని సుప్రీంకోర్టు నవంబరు 11న విముక్తి కల్పించింది.

ఎంపీలో ఢిల్లీ తరహా హత్య

భార్యను నరికి అడవిలో పాతిపెట్టిన భర్త

భోపాల్: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఢిల్లీలో జరిగిన శ్రద్ధా తరహా హత్య జరిగింది. అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త ఆమె మృతదేహాన్ని రెండు ముక్కలుగా నరికాడు. అనంతరం అడవిలో వేర్వేరుగా పాతిపెట్టాడు. షాహ్‌డోల్ జిల్లాకి చెందిన రామ్ కిషోర్ పటేల్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. తన భార్య సరస్వతీ పటేల్‌కు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో భార్యను మెహ్రౌలీ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ గొడ్డలితో ఆమె తల నరికాడు. అనంతరం ఆ అటవీ ప్రాంతంలో తల, మొండాన్ని వేర్వేరుగా పాతిపెట్టాడు. తన సోదరుడు, వదిన కనిపించడం లేదంటూ ఒక వ్యక్తి ఈ నెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో ఒక మహిళ దుస్తులు కనిపించినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. ఆ దుస్తులు అదృశ్యమైన మహిళకు చెందినవిగా గుర్తించారు. ఆ అటవీ ప్రాంతాన్ని పరిశీలించగా తల, మొండెం వేర్వేరుగా పాతిపెట్టినట్లు గ్రహించారు. వెలికి తీసిన ఆ శరీర భాగాలు అదృశ్యమైన సరస్వతీవిగా నిర్ధారించారు. అనంతరం ఆమె భర్త కోసం పోలీసులు వెతికారు. నార్సింగ్‌పూర్‌లోని కరేలీ ప్రాంతంలో ఉన్న రామ్ కిషోర్‌ను అరెస్ట్ చేసి ప్రశ్నించగా అనుమానంతో భార్యను రెండు ముక్కలుగా నరికి చంపినట్లు అంగీకరించాడు. హత్యకు వినియోగించిన గొడ్డలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దళిత మహిళ నీళ్లు తాగిందని

గోమూత్రంతో ట్యాంక్ శుభ్రం

బెంగుళూరు: ఒక దళిత మహిళ నీళ్లు తాగినందుకు గోమూత్రంతో ట్యాంక్‌ను శుభ్రం చేసిన ఘటన కర్ణాటకలోని చామరాజనగర్ జిల్లాలోని హెగ్గోతార గ్రామంలో జరిగింది. ట్యాప్ ద్వారా ఆ దళిత మహిళ నీళ్లు తాగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఉండే అగ్ర కులాలకు చెందిన వాళ్లు ఆ ట్యాంక్‌ను గోమూత్రంతో కడిగినట్లు తెలుస్తోంది. ట్యాంక్‌లో ఉన్న నీటిని ఖాళీ చేయించి దాన్ని శుభ్రం చేశారు. ట్యాంక్‌ను శుభ్రం చేసింది నిజమే కానీ, దాన్ని గోమూత్రంతో కడిగారా లేదా అన్న విషయం తనకు తెలియదని స్థానిక తహసిల్దార్ బసవరాజ్ తెలిపారు. ఆ ట్యాంక్ వద్ద నీళ్లు తాగిన మహిళను ఇప్పటి వరకు ఎవరూ గుర్తించలేదన్నారు. ఆ మహిళను గుర్తించిన తర్వాత కేసు నమోదు చేస్తామని ఆయన చెప్పారు. గ్రామంలో చాలా ట్యాంక్‌లు ఉన్నాయని, అందరూ నీళ్లు తాగవచ్చు అని ఆ ట్యాంక్‌లపై రాసి ఉంటుందని ఆయన తెలిపారు.

షారూక్‌కు రెడ్ సీ ఇంటర్నేషనల్ సన్మానం

న్యూఢిల్లీ: సౌదీ అరేబియాకు చెందిన రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రెండో వార్షికోత్సవం సందర్భంగా బాలీవుడ్ చలనచిత్ర నటుడు షారూక్‌ఖాన్‌ను సన్మానించనున్నది. సినీ పరిశ్రమకు ఈ ప్రముఖ నటుడు చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎర్రసముద్రానికి ఈశాన్యం ప్రాంతంలో ఉన్న జెద్దాలో డిసెంబర్1న ఈ వేడకల ప్రారంభోత్సవంలో ఈ సన్మానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తానెంతో ఉత్సాహంగా ఉన్నానని షారూక్ తెలిపాడు. 'రెడ్‌సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నుంచి ఈ అవార్డును అందుకోవడం గౌరవంగా భావిస్తున్నా. నా చిత్రాలను విశేషంగా ఆదరిస్తున్న సౌదీ అభిమానుల మధ్య ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తాను ప్రస్తుతం సౌదీ అరేబియాలోనే 'దుస్కీ' సినిమా షూటింగ్‌లో ఉన్నట్టు షారూక్ తెలిపారు.

జగనన్న కాలనీల్లో
పక్కా ఇళ్లు నిర్మించాలి

- రూ.5 లక్షలు మంజూరు చేయాలి
- టిడ్కో ఇళ్లు పేదలకు కేటాయించాలి
- జల్లి విల్సన్, ఆవుల శేఖర్ డిమాండ్
- 5న సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పక్కా ఇళ్లను వేగవంతంగా నిర్మించాలని, లేదా రూ.5లక్షలు మంజూరు చేయాలని, టిడ్కో ఇళ్లను తక్షణమే పేదలకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో డిసెంబర్ 5వ తేదీన తలపెట్టిన ఆందోళనలు జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జగనన్న కాలనీలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఐదు లక్షల రూపాయలతో ప్రభుత్వమే వారికి పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్లు 90శాతం గత ప్రభుత్వ హయాంలోనే పూర్తి అయినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు కావస్తున్నప్పటికీ... మిగతా 10శాతం పనులు పూర్తి చేసి పేదలకు ఇవ్వ కుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందన్నారు. జగనన్న కాలనీల్లో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పక్కా ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా నిర్మించడంతోపాటు అక్కడ మౌలిక సదుపాయాలు తాగునీరు, విద్యుత్, రహదారులు, మురుగునీటి వ్యవస్థను తక్షణమే కల్పించి పేదలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ, డిసెంబర్ 5వ తేదీన సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగనున్నామని తెలిపారు. టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టి ఇల్లు రాక ఇబ్బంది పడుతున్న పట్టణ పేదలను, జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాల పట్టాలు పొంది పక్కా గృహాలు రాక ఇబ్బందులు పడుతున్న పేదలందర్నీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకత్వం ఆయా ప్రాంతాల్లో సందర్శించి, ఈ ఉద్యమంలో వారిని భాగస్వాములు చేయాలని జల్లి విల్సన్, ఆవుల శేఖర్ కోరారు.

సోలార్ ప్యానెళ్లు శుభ్రం చేసే కోటింగ్ టెక్నాలజీని కనుగొన్న ఐఐటీ

న్యూఢిల్లీ: జోధ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) పరిశోధకులు సోలార్ ప్యానల్ ఉపరితలాలను స్వయంగా శుభ్రం చేసుకునేలా కోటింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ఇది సౌర ఫలకాలపై దుమ్ము పేరుకుపోవడాన్ని తగ్గిస్తుందనీ, చాలా తక్కువ నీటితో స్వీయ-శుభ్రం చేయగలదని పేర్కొన్నారు. సోలార్ ప్యానెల్ తయారీ ప్లాంట్‌లలో కూడా దీన్ని సులభంగా ఉపయోగించవచ్చునని వివరించారు. ఇందుకోసం సంస్థ పేటెంట్‌కు కూడా దరఖాస్తు చేసింది. "సోలార్ ప్యానెళ్లను తయారు చేసే పరిశ్రమలు 20 నుంచి 25 సంవత్సరాల వరకు తమ సామర్థ్యంలో 80 నుండి 90 శాతం పనిచేస్తాయని పేర్కొంటున్నాయి. అయితే, సౌర ఫలకాలపై దుమ్ము, ఇసుక నిల్వలు వాటి పనితీరును తగ్గిస్తాయని అందరికీ తెలుసు. సౌర విద్యుత్ ప్లాంట్ యొక్క స్థానాన్ని బట్టి, దాన్ని ఉపయోగించే వాతావరణం, సోలార్ ప్యానెళ్లు కొన్ని నెలల్లో దుమ్ము పేరుకుపోవడం వల్ల వాటి ప్రారంభ సామర్థ్యాన్ని 10 నుంచి 40 శాతం కోల్పోతాయని' అని ఐఐటీ జోధ్‌పూర్ మెటలర్జికల్, మెటీరియల్స్ ఇంజి నీరింగ్ విభాగాధిపతి రవి కె.ఆర్ అన్నారు. "సౌర ఫలకాన్ని శుభ్రపరచడానికి ప్రస్తుతం ఉపయోగించే కొన్ని పద్ధతులు ఖరీదైనవి, అసమర్థమైనవి, నిరంతర ఉపయోగంలో వివిధ ఆచరణాత్మక సమస్యలను కలిగి ఉంటాయి. సోలార్ ప్యానెల్‌కు కోలుకోలేని నష్టాన్ని కలిగిస్తాయి. అభివృద్ధి చెందిన సూపర్ హైడ్రో ఫోబిక్ పూత అద్భుతమైన స్వీయ-శుభ్రపరిచే గుణం కలిగి ఉంది' అని ఆయన అన్నారు.

సీమ ద్రోహులు మీరే!

చెట్లను నరకడం రివర్స్ పాలనకు నిదర్శనం

సీఎం జగన్‌పై చంద్రబాబు తీవ్ర విమర్శలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో పరిస్థితులు, వివిధ ఘటనలపై టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సోమవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై వరుస ట్వీట్‌లతో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వివిధ అంశాలపై ప్రభుత్వ నిర్ణయాలను, వైఫల్యాలను తప్పుబడుతూ... ఇదేం ఖర్మ మనకు అంటూ మండిపడ్డారు. రాయలసీమలో నాడు మేము తెచ్చిన పరిశ్రమలు నేడు ఎందుకు వెళ్లిపోయాయి? పెట్టుబడులను తరిమేసింది ఎవరు? సీమ ద్రోహులు ఎవరు? సీమకు పరిశ్రమలు తెచ్చిన మేమా...లేక కాసులకు కక్కుర్తి పడి కంపెనీలను వెళ్లగొట్టిన మీరా? అంటూ చంద్రబాబు ప్రశ్నించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో సీఎం పర్యటన సందర్భంగా చెట్లు నరికివేత చర్యలను చంద్రబాబు తీవ్రంగా నిరసించారు. సాధారణంగా ప్రజాప్రతినిధులు తమ పర్యటనల్లో మొక్కలు నాటడం ఇన్నాళ్లూ చూశాం కానీ సీఎం వస్తున్నారని ఏమాత్రం అడ్డుగా లేని భారీ వృక్షాలను నరికి వేయడం ఈ ప్రభుత్వంలోనే చూస్తున్నామన్నారు. మొక్కలు నాటడం నేర్పాల్సిన పాలకులు...చెట్లు నరికెయ్యమని సందేశం పంపుతున్నారా? ఇదే కదా రివర్స్ పాలన అంటే అన్నారు. నువ్వు జగన్ రెడ్డి కాదు...రివర్స్ రెడ్డి... ఇదేం ఖర్మ రాష్ట్రానికి? అంటూ చంద్రబాబు మరో ట్వీట్ చేశారు. పాలకులు రాక్షసులైతే ఫలితాలు ఎలా ఉంటాయో మన రాష్ట్రమే ఉదాహరణ అంటూ రాప్తాడు నుంచి జాకీ పరిశ్రమ తరలిపోయిన అంశంపై ఇంకో ట్వీట్ చేశారు. ఇక ప్రకాశం జిల్లాలో గిరిజనుల శ్మశాన స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించడం దారుణమన్నారు. 'శ్మశాన స్థలంపై వైసీపీ పిశాచాలు పడ్డాయి... అధికారపార్టీ నేతలు సమాధులను తవ్వేసి శ్మశానాన్ని కబ్జా చేస్తే అధికారులంతా ఏం చేస్తున్నారు? వ్యవస్థలు సమాధి అయిన చోట వచ్చే ఫలితాలు ఇలాగే ఉంటాయన్నారు. ఏపీలో ప్రజారోగ్యాన్ని ఈ ప్రభుత్వం పాడెక్కించింది... కుప్పంలో కవలలకు జన్మనిచ్చిన బాలింతకు చికిత్స అందించకుండా ఆసుపత్రుల వెంట తిప్పి చివరకు తల్లితో పాటు ఒక శిశువు ప్రాణం కూడా తీశారు. ఆస్పత్రుల వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే ఈ దారుణానికి కారణం... కుప్పాన్ని పులివెందులలా చూసుకోవడం అంటే ఇదేనా? అంటూ చంద్రబాబు విమర్శించారు.

పెట్టుబడిదారుల కోసమే బీజేపీ పాలన: రాహుల్

మహువా (గుజరాత్): కేంద్రం, గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వాలు పెట్టుబడిదారుల కోసమే పనిచేస్తున్నాయని, ప్రజల కోసం కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారత్ జోడో యాత్రకు విరామం ప్రకటించిన రాహుల్... గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని సోమవారం సూరత్ జిల్లా మహువా నుంచి ప్రారంభించారు. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉన్న రాహుల్ గాంధీ... గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. మహువాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా నిరుద్యోగం కూడా పెరిగిపోయిందన్నారు. గిరిజనులకు చెందిన భూములను పారిశ్రామిక పెద్దలకు కట్టబెడుతున్నారని బీజేపీపై విమర్శలు గుప్పించారు. గిరిజనులను బీజేపీ మోసం చేస్తుందని మండిపడ్డారు. లాక్కున్న భూములన్నింటినీ తాము అధికారంలోకి వస్తే తిరిగిస్తామని అన్నారు. జోడో యాత్రలో తాను రైతులు, యువత, గిరిజనులు పడుతున్న కష్టాలు తెలుసుకున్నానని చెప్పారు. రాజ్‌కోట్‌లో నిర్వహించిన మరో ర్యాలీలో ప్రసంగిస్తూ... మోర్బీ తీగల వంతెన కూలిన ఘటనకు సంబంధించి కేవలం కాపలాదారును అరెస్టు చేసి జైల్లో పెట్టారని, అసలైన దోషులపై అధికార బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని దుయ్యబట్టారు. 'మోర్బీ విషాదం గురించి జర్నలిస్టులు నన్ను అడిగినప్పుడు... దాదాపు 150 మంది చనిపోయారని, ఇది రాజకీయ సమస్య కాదు... దీని గురించి నేను ఏమీ చెప్పనని చెప్పాను. అయితే ఈ విషాదం వెనుక ఉన్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? వారిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదన్న ప్రశ్న నేడు తలెత్తింది' అని అన్నారు. అధికార బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నందున దోషులకు ఏమీ జరగదా? అని ప్రశ్నించారు. డిసెంబర్ 1, 5 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న గుజరాత్ మీదుగా కాంగ్రెస్ భారత్ జోడో యాత్ర సాగకపోవడం బాధగా ఉందని రాహుల్ గాంధీ అన్నారు.

నేడు 'రోజ్‌గార్ మేళా' నియామక పత్రాల పంపిణీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ 'రోజ్‌గార్ మేళా' (ఉపాధి మేళా)లో భాగంగా, ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దాదాపు 71వేల నియామక లేఖలను ఆయా అభ్యర్థులకు పంపిణీ చేస్తారని, వారిని ఉద్దేశించి ప్రసంగిస్తారని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఉపాధి కల్పనకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలనే తన నిబద్ధతను నెరవేర్చే దిశగా ఈ డ్రైవ్ ఒక ముందడుగు అని, మరిన్ని ఉద్యోగాలను సృష్టించడంలో, యువతకు అర్థవంతమైన అవకాశాలను అందించడంలో ఇది ఉత్ప్రేరకంగా ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొంది. అక్టోబర్‌లో 75 వేల మందికి ప్రధాని నియామక పత్రాలు అందజేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న గుజరాత్ , హిమాచల్ ప్రదేశ్ మినహా దేశవ్యాప్తంగా 45 ప్రదేశాలలో నియామక లేఖల భౌతిక కాపీలు అందజేయబడతాయని వివరించింది. గతంలో భర్తీ చేసిన కేటగిరీల పోస్టులతో పాటు టీచర్లు, లెక్చరర్లు, నర్సులు, నర్సింగ్ ఆఫీసర్లు, డాక్టర్లు, ఫార్మాసిస్టులు, రేడియోగ్రాఫర్లు, ఇతర సాంకేతిక, పారామెడికల్ పోస్టులను కూడా భర్తీ చేస్తున్నట్లు ప్రధాని కార్యాలయం పేర్కొంది.

జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు

- పాత నిబంధనలు సడలించాలి
- రిటైరైన వారికి రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలి
- ప్రమాద బీమా, సంక్షేమ నిధిని పునరుద్ధరించాలి
- ఐ అండ్ పీఆర్ కమిషనర్‌కు ఏపీయూడబ్ల్యూజే నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ప్రవేశపెట్టిన కఠినతర నిబంధనలు సడలించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకీ అక్రిడిటేషన్ మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే డిమాండ్ చేసింది. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో జర్నలిస్టులందరినీ ఐక్యపరిచి ఉద్యమానికి వెనుకాడేదిలేదని యూనియన్ నేతలు స్పష్టం చేశారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ విజయకుమార్ రెడ్డితో ఏపీయూడబ్ల్యూజే నేతలు సోమవారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. జర్నలిస్టులకు జారీ చేసిన అక్రిడిటేషన్ల కాలపరిమితి 2022 డిసెంబర్ 31 నాటికి పూర్తవుతుందని, అక్రిడిటేషన్ లేకుండా ఏ జర్నలిస్టు ఇబ్బందిపడకూడదనే ఉద్దేశంతో గడువులోపే ఆ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. జర్నలిస్టులకు సంబంధించి ఇతర పెండింగ్ సమస్యలపైనా సుదీర్ఘంగా చర్చించారు. గతేడాది కఠిన నిబంధనలు ప్రవేశపెట్టడం వల్ల చాలామంది అర్హులైన జర్నలిస్టులు అక్రిడిటేషన్‌కు నోచుకోలేదని, ఇప్పటికైనా అర్హులైన జర్నలిస్టులను గుర్తించి అక్రిడిటేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం పూర్వంలాగే అక్రిడిటేషన్ కమిటీల్లో యూనియన్లకు ప్రాతినిధ్యం కల్పించాలని విన్నవించారు. రిటైరైన జర్నలిస్టులందరికీ కనీసం రూ.10 వేల పెన్షన్ అందజేయాలని, హెల్త్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలని, జర్నలిస్టులందరికి బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాద బీమా, సంక్షేమ నిధిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యంతో రాష్ట్ర, జిల్లాస్థాయిలో అక్రిడిటేషన్ కమిటీలు ఏర్పాటు చేస్తే అసలైన జర్నలిస్టు వ్యవస్థకు న్యాయం జరుగుతుందని, గతంలో అనేకసార్లు ఈ విషయంపై ఏపీయూడబ్ల్యూజే డిమాండ్ చేసిన విషయాన్ని కమిషనర్‌కు గుర్తుచేశారు. జర్నలిస్టులందరికీ నివేశన స్థలాలు మంజూరు చేస్తానన్న సీఎం హామీని నిలబెట్టు కోవాలని గుర్తు చేశారు. అనుభవజ్ఞులైన జర్నలిస్టుల అక్రిడిటేషన్‌లకు సంబంధించిన అర్హత ప్రమాణాలను 25 ఏళ్ల సర్వీస్‌తో 45 ఏళ్ల వయస్సు నిండిన ప్రతి జర్నలిస్టుకు ఎటువంటి నిబంధనలు లేకుండా ఫ్రీలాన్సర్‌గా అక్రిడిటేషన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద, చిన్న పేపర్లతో పాటు లోకల్ చానల్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ అందేలా కృషిచేయాలని కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమ ర్పించారు. కమిషనర్‌ని కలిసిన వారిలో ఐజేయూ ఉపా ధ్యక్షులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్ధన్, ఉపాధ్యక్షులు కె.జయరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చావా రవి, విజయవాడ అర్బన్ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దాసరి నాగరాజు ఉన్నారు. నేతల అభ్యర్థనపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

దిల్లీ మద్యం కేసు
శరత్ చంద్రారెడ్డికి రిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి మనీలాండరింగ్ వ్యవహారంలో 'హెటిరో' శరత్‌చంద్రారెడ్డితో పాటు బినోయ్ బాబుకు దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు రిమాండ్ విధించింది. అయితే ఈ నిందితులిద్దరికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించిన కోర్టు, వారికి ఇంటి భోజనం, వాటర్ ఫ్లాస్క్, రెండు జతల బట్టలు, చలి దుస్తులు, బూట్లు, అవసరమైన మందులు వాడేందుకు అనుమతి ఇచ్చింది. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో ఉండడంతో ఈడీ అభ్యర్థన మేరకు రౌస్ అవెన్యూ కోర్టు సోమవారం ఈ మేరకు తీర్పునిచ్చింది. వీరిద్దరికీ అవసరమైన వైద్య సహాయం అందించాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబరు 5కు వాయిదా వేసింది. ప్రముఖ ఫార్మా సంస్థ అరబిందో గ్రూపు డైరెక్టర్ అయిన శరత్ చంద్రారెడ్డి వైసీపీ పార్లమెంటరీ నేత సొంత అల్లుడు రోహిత్‌రెడ్డి సోదరుడు. శరత్ చంద్రారెడ్డితోపాటు, పెర్నాడ్ రికార్డు కంపెనీకి చెందిన బినోయ్ బాబును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈనెల 10న అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వివిధ సంస్థలు, వ్యక్తులతో సిండికేట్ ఏర్పాటు చేసుకుని అవినీతి మార్గంలో సొమ్ము కూడగట్టుకుని ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారన్న అభియోగాలపై ఈడీ వీరిద్దరినీ అదుపులోకి తీసుకుంది. ఈ కేసులో శరత్‌చంద్రారెడ్డిని కీలక నిందితునిగా ఈడీ పేర్కొంది. ఆయన తన సొంత బినామీ కంపెనీలతో కలిసి తొమ్మిది జోన్లను చేజిక్కించుకుని దిల్లీలో జరిగే మొత్తం మద్యం వ్యాపారంలో 30 శాతాన్ని నియంత్రిస్తున్నారని వెల్లడించింది.

ఇప్పటివరకు దొరికిన సాక్ష్యాధారాలను బట్టి, కుంభకోణం నడిచిన విధానాన్ని వెలుగులోకి తీసుకురావాల్సి ఉన్నందున వీరిని తమకు 14రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని ఈడీ విజ్ఞప్తి చేయగా, కోర్టు ఏడు రోజులపాటు కస్టడీకి అప్పగించింది. నిందితుల తరపు న్యాయవాదుల కోరిక మేరకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో విచారణకు కోర్టు అనుమతిచ్చింది. విచారణ అనంతరం సోమవారం కోర్టులో హాజరుపరచగా 14రోజుల రిమాండ్ విధించింది. నిందితులు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

శంకరాభరణానికి మరో అరుదైన గౌరవం

పనాజీ: క్లాసిక్ మూవీ 'శంకరాభరణం' చిత్రానికి అరుదైన గౌరవం దక్కింది. గోవాలో జరుగుతున్న 53వ అంతర్జాతీయ భారత చలన చిత్రోత్సవాల్లో రీస్టోర్డ్ ఇండియన్ క్లాసిక్ విభాగంలో ఎంపికైంది. దేశంలో విడుదలైన గొప్ప చిత్రాలను డిజిటలైజ్ చేసి భద్రపరుస్తుంటుంది 'నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా'. ఈ ప్రక్రియకు కళా తపస్వి కె.విశ్వనాథ్ రూపొందించిన 'శంకరాభరణం' ఎంపికైంది. పూర్ణోదయ ఆర్ట్స్‌క్రియేషన్స్ పతాకంపై ఏడిద నాగేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. జె.వి సోమ యాజులు, మంజు భార్గవి, చంద్ర మోహన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. చలన చిత్రోత్సవాల్లో భాగంగా ఈ చిత్రాన్ని ప్రత్యేక ప్రదర్శన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఏడిద నాగేశ్వరరావు కూమారుడు ఏడిద రాజా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతారు.

చిరంజీవికి మోదీ అభినందనలు

పనాజీ: మెగాస్టార్ చిరంజీవికి అరుదైన పురస్కారం లభించింది. చిత్ర రంగానికి ఆయన అందించిన సేవలకుగానూ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఐఫీ-2022 అవార్డు వరించింది. తాజాగా గోవాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా కార్యక్రమంలో కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఈ పురస్కారాన్ని ప్రకటించారు. తాజాగా చిరంజీవికి ఈ పురస్కారం రావడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ట్విట్టర్‌లో మోదీ చేసిన పోస్ట్‌లో.. 'చిరంజీవిగారిని ఎప్పటికీ మర్చిపోలేం. ఆయన పని, వైవిధ్యమైన పాత్రలు, అద్భుతమైన స్వభావం తరతరాలుగా సినీ ప్రేమికులను ఆయన వైపు ఆకర్షించేలా చేస్తున్నాయి. ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నందుకు ఆయనకు అభినందనలు' అని రాసుకొచ్చారు. మోదీ ఈ ట్వీట్ చేసిన కొద్దిసేపటికి ఆయన పోస్ట్‌కి చిరంజీవి రిప్లై ఇచ్చారు.

కృష్ణ అస్థికలు కృష్ణానదిలో కలిపిన మహేశ్

విజయవాడ: సూపర్ స్టార్ మహేశ్ బాబు సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు అందరితో హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడ వచ్చారు. గన్నవరం విమానాశ్రయం నుంచి కృష్ణా నదిలో తండ్రి కృష్ణ అస్థికలు కలపడానికి మహేశ్ బాబు, కుటుంబ సభ్యులు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. అస్థికలు కలిపి, తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. మహేశ్ బాబు వెంట, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, మెహెర్ రమేష్, చిన్నాన్న ఆదిశేషగిరిరావు, బావలు సంజయ్ స్వరూప్, గల్లా జయదేవ్, సుధీర్ బాబు వెళ్లారు. మహేశ్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమాని నిర్మిస్తున్న నాగవంశీ కూడా వీరి వెంట వెళ్లిన వారిలో ఉన్నారు.

నేనేం హంతకుడిని కాదు... ఆ శిక్ష అన్యాయం: వార్నర్

సిడ్నీ: క్రికెట్ ఆస్ట్రేలియాపై ఆ జట్టు డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. బాల్ ట్యాంపరింగ్ ఉదంతం నేప థ్యంలో కెప్టెన్ కాకుండా తనపై విధించిన జీవితకాల నిషేధం చాలా అన్యాయమని అభిప్రాయపడ్డాడు. తానేం క్రిమినల్‌ను కాదని, హంతకులకు కూడా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని అసహనం వ్యక్తం చేశాడు. ఇక 2018 సౌతాఫ్రికా పర్యటనలో యువ క్రికెటర్ బెన్ క్రాఫ్ట్‌తో బాల్ ట్యాంపరింగ్‌కు డేవిడ్ వార్నర్, అప్పటి ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ప్రయత్నించడం దుమారం రేపింది. ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలోనే ఈ ఘటన ఓ మాయని మచ్చగా నిలిచిపోయింది. ప్రపంచం ముందు చీటర్స్‌గా నిలబెట్టింది. దాంతో క్రికెట్ ఆస్ట్రేలియా సైతం ఈ ముగ్గురి ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంది. ఓ ఏడాది పాటు పూర్తిగా ఏ తరహా క్రికెట్ ఆడకుండా నిషేధించిన సీఏ.. ప్రధాన కారకుడైన వార్నర్.. కెప్టెన్ కాకుండా జీవితం కాలం నిషేధం విధించింది.

నేను హంతకుడిని కాదు..

తనపై విధించిన జీవిత కాల కెప్టెన్సీ నిషేధాన్ని తొలగించాల్సిందిగా క్రికెట్ ఆస్ట్రేలియాను డేవిడ్ వార్నర్ ఇప్పటికే చాలా సార్లు కోరాడు. క్రికెట్ ఆస్ట్రేలియా మాత్రం ఈ విషయంలో చాలా జాప్యం చేస్తోంది. దాంతో డేవిడ్ వార్నర్, ఆసీస్ క్రికెట్ బోర్డు తీరుపై ఆవేదన వ్యక్తం చేశాడు. ఓ స్పోర్ట్స్ చానెల్‌కు ఇచ్చి ఇంటర్వ్యూలో.. 'నేను క్రిమినల్‌ను కాదు. ఏదో ఒక స్టేజీ దాటిన ప్రతీ ఒక్కరికీ అప్పీలు చేసుకునే అవకాశం ఉండాలి. కొంతకాలం పాటు బ్యాన్ వేస్తే తప్పు లేదు, కానీ జీవితకాలమంతా కెప్టెన్సీ చేయకూడదనడం చాలా కఠినం.. చాలా రోజులుగా బ్యాన్ ఎత్తివేస్తారని ఎదురుచూస్తున్నా.

దాన్ని సాకుగా చూపించి..

ఈ ఏడాది ఫిబ్రవరిలో నాపై నిషేధం ఎత్తివేస్తారని అనుకున్నా, కానీ అలా జరగలేదు. ఇది నాకూ, నా కుటుంబానికి, ఈ వివాదంలో ఇరుక్కున్న వారందరికీ చాలా కష్టంగా ఉంది. జరిగిపోయినదాన్ని ఇప్పుడు క్షుణ్ణంగా వివరించి చెప్పాల్సిన అవసరం లేదు. ఏం జరిగిందో మళ్లీ చెప్పాల్సిన పని లేదు. ఫించ్ రిటైర్ అయిన తర్వాత నాకు కెప్టెన్సీ దక్కుతుందని ఆశించా. నాపైన వేసిన కెప్టెన్సీ బ్యాన్‌ను ఎత్తివేస్తారని అనుకున్నా. కానీ అలా జరగలేదు. 2018లో నాలుగేళ్ల క్రితం జరిగినదాన్ని సాకుగా చూపించి, ఇప్పుడు కెప్టెన్సీకి అర్హుడు కాదని చెప్పడం అసహనానికి గురి చేస్తోంది.'అని వార్నర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

ముగ్గురు సభ్యుల ప్యానెల్..

ఆరోన్ ఫించ్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రక టించిన తర్వాత వార్నర్‌కే సారథ్య బాధ్యతలు దక్కు తాయని అంతా భావించారు. క్రికెట్ ఆస్ట్రేలియా మాత్రం వార్నర్‌ని పక్కనబెట్టి ప్యాట్ కమ్మిన్స్‌కి వన్డే కెప్టెన్సీ అప్పగించింది. అయితే క్రికెట్ ఆస్ట్రేలియా వార్నర్‌పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. వన్డే కెప్టెన్సీ బాధ్యతలు వార్నర్‌కే ఇవ్వాలని మాజీ క్రికెటర్లు సూచించిన నేపథ్యంలో సీఏ.. ఆ దిశగా అడుగులు వేస్తోంది. జీవిత కాల నిషేధంపై ముగ్గురు సభ్యుల ప్యానెల్‌కు వార్నర్ అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తూ సీఏ తాజాగా నిర్ణయం తీసుకుంది.

త్వరలో టెస్టుల్లోకి: సూర్య

మౌంట్ మాంగనుయ్: మిస్టర్ 360 త్వరలో భారత టెస్టు జట్టులో అడుగు పెడతానని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆదివారం న్యూజిలాండ్‌పై 'గాడ్‌మోడ్'లో ఆడిన 111 పరుగుల ఇన్నింగ్స్ అనంతరం అతడు అంతర్జాతీయ టెస్టు క్రికెట్లోకి అరంగేట్రంపై స్పందించాడు. 'కెరీర్ ఆరంభించిందే ఎర్రబంతి క్రికెట్ (టెస్టులు)తో. నా ముంబై జట్టు కోసం ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాను. టెస్టు క్రికెట్‌పై నాకు మంచి అవగాహన ఉంది. ఆ ఫార్మాట్ ఆడటాన్ని నేను ఎంజాయ్ చేస్తాను. త్వరలోనే టీమ్ ఇండియా టెస్టు క్రికెట్ క్యాప్‌ను అందుకొం టానని ఆశిస్తున్నాను" అని సూర్యకుమార్ తన మనసులోని మాట చెప్పాడు.

గతాన్ని గుర్తుంచుకొంటాను

బాగా ఆడిన సమయంలో కూడా టీమ్ ఇండియా నుంచి పిలుపు రాకపోవడంతో నిరాశకు గురైన సందర్భాలను తాను మర్చిపోనని సూర్యకుమార్ వెల్లడించాడు. 'నా గతాన్ని ఎప్పటికీ గుర్తుంచుకునే ముందుకెళ్తాను. నేను ఒక్కడినే ఉన్నా.. నా భార్యతో ప్రయాణిస్తున్నా.. రెండు మూడేళ్ల క్రితం పరిస్థితి ఏంటి.. ప్రస్తుత పరిస్థతి ఏమిటని చర్చించుకుంటాం. అప్పటికీ ఇప్పటికీ ఏం మారిందో మాట్లాడుకుంటాం. అప్పట్లో కొంత నిరాశ ఉండేది. కానీ, దానిలో కూడా ఏదో ఒక ఆశాకిరణం వెతికే వాళ్లం. మరింత మెరుగైన క్రికెటర్‌గా ఎలా మారగలను అని ఆలోచించేవాణ్ని. ఆ తర్వాత కొంత భిన్నంగా ప్రయత్నించాను. సరైన ఆహారం, నాణ్యమైన సాధన, మంచి నిద్ర వంటివి వాటిల్లో ఉన్నాయి. ఆ ఫలాలను ఇప్పుడు అనుభవిస్తున్నాను. బాగా ఆడినా.. ఆడకపోయినా.. నేను మ్యాచ్ పూర్తయ్యాక.. హైలైట్స్ చూస్తాను. ఆ సమయంలో కొన్ని సార్లు నా షాట్లను చూసి నేనే ఆశ్చర్యపోతాను"

అతిగా ఆలోచించను..

"మ్యాచ్‌ను మించి నేను ఆలోచించను. ఒక వేళ ఆటకు అవసరమైనదాని కంటే.. బౌలర్ల కంటే ఎక్కువగా ఆలోచిస్తే.. ప్లానింగ్ తప్పుదారి పడుతుంది. అందుకే వాస్తవిక పరిస్థితుల్లోనే ఉంటాను. అతిగా ఆలోచిం చను. బాగా ఆడిన సమయంలో అనుసరించిన రోజువారీ విధానాలను, సాధనను ఎప్పుడూ కొనసాగించాలని నేను అనుకుంటాను. 99శాతం అదే చేయడానికి ప్రయత్నిస్తాను. ఉదాహరణకు నేను జిమ్ చేస్తాను. సరైన సమయానికి భోజనం ముగిస్తాను. 15-20 నిమిషాలు కునుకు తీస్తాను. ఇవి చిన్న చిన్న విషయాలే. కానీ, మ్యాచ్ ఉన్న రోజుల్లో కూడా నేను ఇవే చేయడానికి యత్నిస్తాను. మైదానంలోకి వచ్చేటప్పటికి ఉత్సాహంగా ఉంటాను"

ఆఫ్‌డేస్‌లో కుటుంబంతోనే..

"నేను మ్యాచ్‌లు లేని రోజుల్లో చాలా సమయం కుటుంబంతోనే గడుపుతాను. ఆ సమయంలో వారు ఎప్పుడూ ఆట గురించి నాతో మాట్లాడరు. అది నన్ను సాధారణంగా ఉండేలా చేస్తుంది. అది చాలా ముఖ్యం. దీంతో చాలా సమయం సౌకర్యవంతమైన పరిస్థితుల్లో ఉండగలుగుతాను" అని సూర్యకుమార్ వివరించాడు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.